



నౌ..కాకినాడ!

నౌ..కాకినాడ.. ఈ టైమ్ కాకినాడది.. అవును మరి నిజమే.. ఎందుకంటే షిప్ తయారీ కేంద్రంగా మారనుంది.. ఆ కేంద్రం అంటే మాటలా.. మన రాష్ట్రంలో ఒక్క విశాఖలో మాత్రమే ఉంది.. ఇప్పుడు కాకినాడలోనూ అడుగులు పడుతున్నాయి. కూటమి ప్రభుత్వం ప్రకటించిన మారిటైం బోర్డు పాలసీలో నౌకల నిర్మాణానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది.. ఈ నేపథ్యంలో ఆ కేంద్రానికి కాకినాడ అనుకూలంగా ఉంటుందని ప్రతిపాదనలు పంపారు. దీంతో కాకినాడ టైం నేడో రేపో మారనుంది.. ఈ మేరకు అధికారులు కసరత్తు చేస్తున్నారు..



కాకినాడలో తయారైన భారీ షిప్... నిర్మాణంలో ఉన్న మరో ఓడ

మారిటైం బోర్డు పాలసీతో తిరగనున్న దశ

- షిప్‌ల నిర్మాణానికి అనువుగా కాకినాడ
- షిప్ బిల్డింగ్ సెంటర్‌కు ప్రతిపాదన
- సుదీర్ఘ సీఫ్రంట్‌తో ప్రయోజనం
- పలు కంపెనీలూ ఆసక్తి
- గతంలో కరువైన వైసీపీ ప్రోత్సాహం
- మూడు కంపెనీలు వెనక్కు
- ఈసురోమన్న నౌకా నిర్మాణ రంగం
- కూటమితో చిగురిస్తోన్న ఆశలు

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

షిప్‌ల తయారీ రంగానికి కేంద్రంగా కాకినాడను తీర్చిదిద్దేలా అడుగులు పడుతున్నాయి.రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన మారిటైం బోర్డు పాలసీలో నౌకా నిర్మాణ క్లస్టర్ల ఏర్పాటుకు ఆమోదం తెలపడంతో కాకినాడలో వీటి తయారీ భవిష్యత్తులో భారీగా పుంజుకోబోతోంది. అటు రూ.300 కోట్లతో చిన్న, మధ్యతరహా నౌకల నిర్మాణానికి వీలుగా షిప్ బిల్డింగ్ సెంటర్ ఏర్పాటుకు అధికారులు తాజాగా ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ముున్ముందు కాకినాడలో చిన్న, మధ్యతరహా నౌకలు, బార్జీలు, టగ్‌ల తయారీకి ఊతం లభించనుంది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం మారిటైం పాలసీ కింద నౌకల తయారీ క్లస్టర్లకు ప్రోత్సాహం ఇవ్వాలని నిర్ణయించడం, అటు మారిటైం బోర్డు కార్యాలయం సైతం ఇక్కడే ఉండడంతో కాకినాడ దశ తిరగనుంది.

కాకినాడకు ఎప్పటి నుంచో పేరు..

విశాఖలో కేంద్ర ప్రభుత్వానికి చెందిన హిందుస్థాన్ షిప్‌యార్డు మినహా రాష్ట్రంలో నౌకల నిర్మాణం ఇంకెక్కడా లేదు. కానీ వీటి తయారీకి అత్యంత అనువైన వాతావరణం కాకినాడలోనే ఉంది. ఒకప్పుడు బ్రిటిష్ యుగంలో కోరంగి వద్ద నౌకల తయారీ, మరమ్మతులు జరిగేవి. అప్పుడే ఈ రంగంలో కాకినాడ పేరొందింది. వాస్తవానికి సుదీర్ఘ సాగర తీరం..దాన్ని ఆనుకుని యాంకరేజ్ పోర్టు వెంబడి వందల ఎకరాల భూములు ఉన్నాయి. నౌకల తయారీకి సముద్రానికి ఆనుకుని విశాలమైన భూములు అవసరం. నౌకలు, బార్జీలు, టగ్‌లు తయారుచేసి ఆ పక్కనే ఉన్న సముద్రజలాల్లోకి వీటిని దించి పరీక్షలు చేస్తారు. ఈ అనుకూల వాతావరణం కాకినాడలోనే ఉంది. సీఫ్రంట్‌గా పిలిచే ఈ సౌకర్యం కాకినాడ జగన్నాథపురం బ్రిడ్జి నుంచి యాంకరేజ్ పోర్టు రెండు కిలోమీటర్ల వరకు విస్తరించి ఉంది. వీటిని పోర్టు అధికారులు లీజుకు ఇస్తారు. ఇందులోనే శాన్ మెరైన్ ఏటా 20 వరకు చిన్నతరహా ఓడలను తయారుచేస్తోంది. అయితే కొత్త పాలసీ కింద కంపెనీలు వస్తే భవిష్యత్తులో నగరం నౌకల తయారీకి ప్రసిద్ధి చెందనుంది. అటు అధికారులు కొత్త నౌకా నిర్మాణ కేంద్రం ఈ ప్రాంతంలోనే అనువుగా ఉంటుందని తాజాగా గుర్తించారు.

నాడు పట్టించుకోని వైసీపీ

కాకినాడలో శాన్‌మెరైన్ అనే సంస్థ ఒక్కటే ఎన్నో ఏళ్లుగా చిన్న, మధ్యతరహా నౌకలు, బార్జీలు, టగ్‌లు నిర్మిస్తోంది. గతేడాది ఏకంగా 8 వేల టన్నుల భారీ నౌకను నిర్మించింది. వచ్చే ఐదేళ్లలో మరో 25 వరకు నౌకలను నిర్మించి దేశవ్యాప్తంగా పలు కంపెనీలకు అందివ్వడానికి సిద్ధమవు తోంది. మేట్ మెరైన్ అనే కంపెనీ పది ఎకరాల్లో వీటి తయారీకి సిద్ధమైనా గత ప్రభుత్వ ప్రోత్సాహం కరువై పక్కకుపోయింది. కేంద్రం ఒక పక్క రాయితీలు ప్రకటిస్తున్నా గత వైసీపీ సర్కారు మాత్రం ఈ రంగాన్ని ప్రోత్సహించడంపై దృష్టి సారించలేదు. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం ఏపీ మారిటైం పాలసీని ప్రకటించడంతో ఈ రంగం పుంజుకోవడానికి అవకాశం ఏర్పడింది. ప్రధానంగా నౌకల తయారీ క్లస్టర్లకు ప్రాధాన్యం కల్పిస్తామని ప్రకటించడంతో ఇప్పుడు కంపెనీలు దృష్టిసారించి కాకినాడకు రావడానికి ఆసక్తి చూపిస్తున్నాయి. అటు పాలసీ అమలుకు ఏపీ మారిటైం బోర్డును నోడల్ ఏజెన్సీగా నియమించింది. ఈ కార్యాలయం కాకినాడలో ఉండడంతో భవిష్యత్తులో నౌకా నిర్మాణం పుంజుకోవడానికి అడుగులు పడుతున్నాయి. రూ.300 కోట్లతో ఇక్కడ నౌకా తయారీ కేంద్రం ఏర్పాటుకు అధికారులు తాజాగా ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. దీనికి ప్రభుత్వం ఆమోద ముద్ర వేస్తే భారీ పెట్టుబడులు రానున్నాయి. దేశవ్యాప్తంగా అనేక రాష్ట్రాల్లో ఉన్న హిందుస్థాన్, కొచ్చిన్, గోవా, మజ్‌గావ్ షిప్ యార్డులు 100 నుంచి 150 ఎకరాల విస్తీర్ణంలో నౌకలను నిర్మిస్తున్నాయి. కాకినాడలో ఐదెకరాల విస్తీర్ణంలోనే భారీ నౌకల తయారీకి సహజసిద్ధ సీఫ్రంట్ వాతావరణం అనుకూలంగా ఉంది. కానీ ప్రోత్సాహం లేక పెట్టుబడులు రాలేదు. నౌకల తయారీ క్లస్టర్లకు ప్రోత్సాహం కల్పిస్తున్నామని ఇటీవల సీఎం చంద్రబాబు ప్రకటించడంతో కాకినాడ కేంద్రంగా ఈ రంగం ఎదిగేలా చేయడానికి అధికారులు కసరత్తు ప్రారంభించారు.

వచ్చి.. వెళ్లిపోయాయి..

గతంలో కాకినాడలో నౌకల నిర్మాణం, మరమ్మతులకు షిప్‌యార్డును నిర్మించడానికి సింగపూర్ కంపెనీ ముందుకు వచ్చింది. సీపోర్టులో కొంతకాలం కార్యకలాపాలు నిర్వహించింది. వివిధ దశల్లో రూ.1,725 కోట్ల పెట్టుబడులకు సిద్ధమైంది. కానీ సరైన ప్రోత్సాహం కరువవడంతో ఇక్కడ యార్డును మూసేసింది. ఎల్ అండ్‌టీ కంపెనీ 2006లో కాకినాడలో షిప్ యార్డు నిర్మాణానికి ముందుకు వచ్చింది. రూ.2 వేల కోట్ల పెట్టుబడితో నౌకా నిర్మాణ కేంద్రం ఏర్పాటుకు రంగం సిద్ధం చేసుకుంది. కానీ ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం లేకపోవడంతో చెన్నైకు వెళ్లిపోయింది. మరోపక్క 2020లో రూ.7కోట్ల కాకినాడ స్మార్ట్‌సిటీ నిధులతో జగన్నాథపురం సమీపంలో అధికారులు బోట్ బిల్డింగ్ యార్డు నిర్మించారు. ఇందులో ఒకేసారి 18 వరకు భారీ బోట్లు తయారుచేసే వసతులు సిద్ధం చేశారు. కానీ ప్రభుత్వ ప్రోత్సాహం లేకపోవడంతో అది ఈసురోమంటోంది.

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక అర్జీలకు

శాశ్వత పరిష్కారం చూపాలి

కలెక్టరేట్‌లో అర్జీలు స్వీకరించిన కలెక్టర్ మహేష్‌కుమార్

వివిధ సమస్యలపై 210 అర్జీలు



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం టౌన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో అందిన అర్జీలకు సంబంధించి తూతూమంత్రంగా పరిష్కారాలు చూపించవద్దని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ స్పష్టం చేశారు. రీఓపెన్‌కు ఆస్కారం లేకుండా పూర్తి నాణ్యతతో సమస్యలను పరిష్కరించాలన్నారు. కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో సోమవారం పీజీఆర్ఎస్ కార్యక్రమంలో భాగంగా కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి, డీఆర్డీఏ పీడీ డాక్టర్ వి.శివశంకరప్రసాద్, డ్వామా పీడీ ఎస్.మధుసూదన్ జిల్లా నలుమూలల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి 210 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మహేష్‌కుమార్ మాట్లాడుతూ అధికారులు బాధ్యతగా పనిచేస్తూ ప్రతీ సమస్యకు పరిష్కార మార్గం చూపాలని హితవు పలికారు. ఆర్థికపరమైన సమస్యలు మినహా ఆర్థికేతర సమస్యలన్నింటినీ నూరు శాతం పరిష్కరించాలని ఆదేశించారు. సమస్యల పరిష్కారంలో బాధ్యతా రాహిత్యంగా వ్యవహరించే అధికారులపై చర్యలు తప్పవన్నారు. సమస్య పరిష్కారానికి నోచుకోకపోతే అందుకు గల కారణాలను కూడా స్పష్టంగా అర్జీదారులకు తెలియజేయాలన్నారు. విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల వద్దకు జేసీ నిషాంతి స్వయంగా వెళ్లి వారి సమస్యలు అడిగి తెలుసుకుని అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.దుర్గారావుదొర, డీసీహెచ్ఎస్ కార్తీక్, జిల్లా వ్యవసాయాధికారి వి.బోసుబాబు, జీఎం డీఐసీ పీకేపీ ప్రసాద్, ఉద్యాన అధికారి బీవీ రమణ, జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీంబాషా, అసిస్టెంట్ లేబర్ కమిషనర్ టి.నాగలక్ష్మి, ఎల్డీఎం కేశవవర్మ, జిల్లా సహకార అధికారి ఎస్.మురళీకృష్ణ, ట్రాన్స్‌కో ఎస్ఈ ఎస్.రాజబాబు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సీహెచ్ఎన్వీ కృష్ణారెడ్డి, డీపీఆర్వో కె.లక్ష్మీనారాయణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పోలీస్ గ్రీవెన్స్‌కు 20 అర్జీలు



అర్జీ పరిశీలిస్తున్న ఎస్పీ కృష్ణారావు

అమలాపురం టౌన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో 20 అర్జీలను ఎస్పీ బి.కృష్ణారావు స్వీకరించారు. సివిల్ తగాదాలతో పాటు కుటుంబ కలహాలు, ఇతర అంశాలపై అందిన అర్జీల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆయా పోలీసుస్టేషన్ల అధికారులకు ఎస్పీ సూచించారు.

గ్రామాలకు సోలార్ వెలుగులు



జిల్లాలో ఐదు గ్రామాలు ఎంపిక

విద్యుత్ శాఖ ఎస్ఈ రాజబాబు

మండపేట, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకంలో భాగంగా గ్రామాల్లో సోలార్ విద్యుత్ ఏర్పాటు ద్వారా విద్యుత్ వినియోగం తగ్గించాలన్న ఆశయంతో గ్రామాల్లో సోలార్ విద్యుత్ పలకల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ఐదు గ్రామాలను సోలార్ సిస్టం ఏర్పాటు కోసం ప్రభుత్వం ఎంపిక చేసిందని జిల్లా విద్యుత్ శాఖ ఎస్ఈ రాజబాబు తెలిపారు. ఈ ఏడాది ప్రారంభించే ఈ పథకానికి సంబంధించి వచ్చే ఏడాది మార్చి నాటికల్లా ఐదువేల సోలార్ యూనిట్లను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. జిల్లాలో మండపేట మండలం అర్తమూరు, రామ చంద్రపురం మండలం ద్రాక్షారామ, కొత్తపేట మండలం వానపల్లి, ఐ.పోలవరం మండలం కేశనకుర్రు పంచాయతీ పరిధిలో గల పల్లెగూడెం, ఐనవిల్లి మండలం ఎస్.మూల పొలం గ్రామాలు ఎంపికయ్యాయన్నారు. 5000 జనాభా కలిగిన గ్రామాలు అర్తమూరు, ద్రాక్షారామ, వానపల్లి ఉండగా మిగిలిన పల్లిపాలెం, ఎస్.మూలపొలం చిన్న గ్రామాలని ఆయన తెలిపారు. సోలార్ విద్యుత్‌పై ప్రజలకు అవగాహన కల్పించటంతో పాటు దానివల్ల కలిగే ప్రయోజనాలు ప్రజలకు వివరించనున్నట్లు తెలిపారు. జిల్లాలో ఎంపిక చేసిన మోడల్ విలేజ్ మండపేట మండలం అర్తమూరులో సోలార్ పవర్ పథకాన్ని ప్రారంభిస్తున్నామని ఆయన తెలిపారు. మంగళవారం గ్రామంలో జరిగే కార్యక్రమంలో రాష్ట్ర అంచనాల కమిటీ ఛైర్మన్, మండపేట శాసనసభ్యుడు ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని చెప్పారు. ప్రభుత్వం సోలార్ అందిస్తున్న సబ్సిడీ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎస్ఈ రాజబాబు కోరారు.



ఆక్వా రైతుల్లో

చిగురిస్తున్న ఆశలు

అయినవిల్లి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాభివృద్ధిలో కీలక పాత్ర పోషించే ఆక్వా రంగం గత కొన్నేళ్లుగా తీవ్ర ఆటుపోట్లు ఎదుర్కొంటోంది. గత వైసీపీ ప్రభుత్వంలో ఆక్వా ఫీడ్ 25 కిలోల బస్తా ధర రూ.700 పెరిగి రూ.2700కు చేరుకుంది. విద్యుత్ రాయితీలు లేక డీజిల్ భారం మోయలేక ఆక్వాకు సరైన ధర లేక రైతులు విలవిల్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ధరల పెరుగుదలతో ఆక్వా రైతుల్లో ఆనందం వెల్లివిరిసింది. జిల్లాలో 36వేల ఎకరాల్లో ఆక్వా అధికారికంగాను, అనధికారికంగా 6వేల ఎకరాల్లో సాగవుతోంది. వ్యవసాయ ఆధారిత పరిశ్రమలపై జిల్లాలో 10లక్షల మంది కార్మికులు జీవనోపాధి పొందుతున్నారు. వ్యవసాయ, ఆక్వా ఆధారిత పరిశ్రమలు నెలకొల్పితే మరింత మంది కార్మికులకు ఉపాధి అవకాశాలు కల్పించవచ్చు. ఆక్వారంగ అభివృద్ధికి మేత ధరలు తగ్గించాలని, నాణ్యమైన రొయ్య సీడ్ రైతులకు సరఫరా చేయాలని, విద్యుత్ రాయితీలు ప్రభుత్వం కల్పించాలని కోరుతున్నారు. గతంలో వంద కౌంట్ రొయ్యల ధర రూ.150 ఉండగా, ప్రస్తుతం రూ.250 ధర పలుకుతోంది. 60 కౌంట్ రూ.340, 50 కౌంట్ రూ.370, 40 కౌంట్ రూ.420 ధర పలుకుతుండడంతో ఆక్వా రైతుల్లో ఆశలు చిగురించాయి.

మేత ధరలు తగ్గించాలి

కళ్లేపల్లి సుబ్బరాజు,రైతు, నేదునూరు



గత ప్రభుత్వంలో నాణ్యమైన సీడ్ సరఫరా కాకపోవడంతో ఆక్వా రైతులు తీవ్రంగా నష్టపోయారు. 25 కిలోల మేత బస్తాకు రూ.700కు పైగా ధర పెంచేశారు. గతంలో టీడీపీ ప్రభుత్వం ఏరియేటర్లను రాయితీపై అందించేవారు. వైసీపీ ప్రభుత్వం సబ్సిడీని ఎత్తివేసింది. ప్రస్తుతం ఎకరాకు రూ.4 లక్షల మేర పెట్టుబడి అవుతుంది. ఆక్వా రైతులకు ప్రభుత్వం నాణ్యమైన సీడ్ అందించడంతో పాటు మేత ధరలు తగ్గించేలా చర్యలు తీసుకోవాలి..

అక్రమార్జనలో అంతా ఒక్కటై..



పి.గన్నవరం శివారు డీఎస్ పాలెంలో నదీపాయకు మధ్యలో ఏర్పాటు చేసిన బాట నుంచి వస్తున్న ఇసుక ట్రాక్టర్లు



ఉడిమూడిలో నదీపాయకు అడ్డుకట్ట వేసిన దృశ్యం

- ఉచిత ఇసుక పేరుతో అక్రమ తవ్వకాలు
- ఇసుక ఉంటే చాలు దోచుకుపోతున్నారు!
- అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో రెచ్చిపోతున్న మాఫియా
- నిబంధనలకు విరుద్ధంగా నదీపాయలకు అడ్డుకట్టలు
- సీఆర్‌జెడ్ నిబంధనలు ఎందుకు పాటించడంలేదు?
- ప్రేక్షక పాత్ర పోషిస్తున్న అధికారులు

పి.గన్నవరం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఉచిత ఇసుక పేరుతో నదీ తీరాల్లో ఉన్న ఇసుక నిల్వలను కొందరు దోచుకుపోతున్నారు. కూటమి నేతలు అంతా ఒక్కటై జేబులు నింపుకుంటున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి..అయినప్పటికీ రెవెన్యూ అధికారులు నోరు మెదపడం లేదు. మైన్స్ అధికారులు అయితే అటువైపు కన్నెత్తి చూడటం లేదు. ఉచిత ఇసుక నెపంతో గోదావరి నదీతీర ప్రాంతాల్లో కనీస అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్నారు. కొన్ని అనధికార ర్యాంపుల్లో బాట చార్జీలు, కూలీ ఖర్చులు తీసుకుంటున్నప్పటికీ కొన్ని ప్రాంతాలలో విచ్చలవిడిగా రాత్రివేళల్లో సైతం ఇసుక, తువ్వ మట్టిని దోచుకుపోతున్నారని పలువురు బహిరంగంగానే చెబుతున్నారు.

అనధికార ఇసుక ర్యాంపులో వివాదాలు

పి.గన్నవరం అక్విడెక్టు సమీపంలో లంకలగన్నవరం, పి.గన్నవరం ప్రాంతాలలో బోట్స్‌మేన్ ర్యాంపులను కొంత కాలం అనధికారికంగా నడిపించారు. అయితే లంకలగన్నవరం వైపు డ్రెడ్జర్ సాయంతో ఇసుక తవ్వకాలు జరపడంతో అధికారులు అడ్డుకట్ట వేశారు. పి.గన్నవరం వైపు ఉన్న బోట్స్‌మేన్ ర్యాంపు ఇటీవల వరకు నడిచినప్పటికి కూతవేటు దూరంలో వెలిసిన ఓపెన్ ర్యాంపుతో ర్యాంపును నిలిపివేశారు. అయితే కూటమి నేతలు, బోట్స్‌మేన్ సొసైటీ సభ్యులు కుమ్మక్కై ఓపెన్ ర్యాంపును గత కొన్ని రోజులుగా నడిపిస్తున్నారనే ఆరోపణలు వినపడుతున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా నదీపాయకు అడ్డుకట్ట వేసి నది మధ్యలో ఉన్న ఇసుక నిల్వలను తవ్వుకుంటున్నారు. ర్యాంపులో మాత్రం జట్టు, బాట ఖర్చులు నిమిత్తం రూ.700 వసూలు చేస్తున్నారు. ఆ ప్రాంతంలో ఇసుక పెద్దగా లేకపోవడంతో గోదావరి పోటు సమయంలో నదీపాయ వద్ద ఇసుకను, తువ్వమట్టిని తవ్వుకుంటున్నారు. ఇది ఇలా ఉండగా ర్యాంపు వద్ద ఆధిపత్యం విషయంలో సొసైటీ సభ్యులకు, కూటమి నేతలకు మధ్య సోమవారం వివాదం నెలకొందని తెలిసింది. ర్యాంపులో అందించే స్లిప్పులపై సొసైటీ పేరు ఉండాలన్నది సభ్యులు వాదన కానీ ట్రాక్టర్‌కు ఇచ్చే స్లిప్పులపై డీఎస్ పాలెం ర్యాంపు అని ఉంది. దీంతో వారి మధ్య వివాదం తలెత్తి ర్యాంపును అడ్డుకునే పరిస్థితులు నెలకొన్నాయని సభ్యుడొకరు చెప్పారు. ర్యాంపు కూడా ఉదయం ఒక గంటపాటు ఆగినట్లు స్థానికులు చెబుతున్నారు. మండలంలోని మానేపల్లిలో కూడా ఇసుక, తువ్వమట్టి తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. సోమవారం ఉచిత ఇసుక బ్యానర్‌తో ఉన్న తువ్వమట్టి ట్రాక్టర్‌ను అదుపులోకి తీసుకుని తహశీల్దార్ కార్యాలయానికి తరలించినట్లు వీఆర్‌వో చెప్పారు. అలాగే కందాలపాలెం, ఉడిమూడి, గంటిపెదపూడి తదితర ప్రాంతాలలో నేతలు కనుసన్నల్లో రాత్రివేళల్లో ఇసుక తవ్వకాలు జరుపుతున్నట్లు తెలిసింది. మామిడికుదురు మండలంలో నాయకులు మధ్య నెలకొన్న స్వల్ప వివాదాలు, ఒకరిపై ఒకరు అభియోగాలు చేసుకోవడంతో నియోజకర్గ ముఖ్య నాయకులు కల్పించుకుని ర్యాంపులను నిలిపివేయించినట్లు సమాచారం.

సీఆర్‌జెడ్ పరిధిలో స్టాక్ యార్డులు రావాలి

సీఆర్‌జెడ్ పరిధిలో ఉన్న పలు మండలాల్లో ఇసుక ర్యాంపులను అధికారికంగా గుర్తించడం లేదు. దీంతో ఆ ప్రాంత వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో అధికార ఇసుక ర్యాంపులు నుంచి స్థానికంగా ఇసుక స్టాక్ యార్డులు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు. స్టాక్ యార్డ్‌లు ఏర్పాటు చేస్తే అనధికార ఇసుక ర్యాంపులు బెడద ఉండదని అభిప్రాయ పడుతున్నారు.

నిబంధనల అతిక్రమణపై ఫిర్యాదు



మానేపల్లిలో తువ్వమట్టి ట్రాక్టర్‌ను అదుపులోకి తీసుకున్న అధికారులు

కోస్టల్ రెగ్యులేటరీ జోన్(సీఆర్‌జెడ్) నియమ నిబంధనల అతిక్రమణ, పర్యావరణానికి హాని చేస్తూ రివర్ బెడ్‌లో అక్రమంగా ఇసుక, తువ్వమట్టి తవ్వకాలను నిర్వహిస్తున్న వారిపై, వారికి సహకరిస్తున్న రెవెన్యూ, పోలీస్ అధికారులపై తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన గ్రీవెన్స్‌సెల్‌లో ఉడిమూడి జనసేన ఎంపీటీసీ-2 అదిమూలం సూరయ్యకాపు ఫిర్యాదు చేశారు. ఇదే విషయంపై డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, ఎన్‌జీటీలకు కూడా ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు.

భూసమస్యల పరిష్కారంలో అలసత్వం వద్దు

కలెక్టర్ మహేష్‌కుమార్



అర్జీ స్వీకరిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

పి.గన్నవరం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో భూ సమస్యలు పరిష్కారంలో తప్పించుకునే ధోరణి ప్రదర్శిస్తే సంబంధిత అధికారులపై శాఖాపరమైన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ హెచ్చరించారు. తహశీల్దార్లు, ఆర్డీవోలు భూవివాదాలకు సంబంధించి సమస్య తీవ్రతను దృష్టిలో ఉంచుకుని అక్కడికక్కడే పరిష్కరించాలని కాని వాటిని ఉన్నతాధికారులు దృష్టికి తీసుకువెళ్లాలని ఆయన సూచించారు. పి.గన్నవరం మండలం నరేంద్ర పురంలో జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. రైతులు అధికారులు దృష్టికి తీసుకువచ్చే ప్రతి సమస్యను పూర్తి స్థాయిలో పరిష్కరించాలని సూచించారు. సమస్యలు పరిష్కరించే క్రమంలో బాధ్యతా రాహిత్యాన్ని ప్రదర్శిస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. అధికారులు తమ ఆలోచన ధోరణిలను మార్చుకుని అంకితభావంతో పనిచేస్తే రెవెన్యూ సదస్సుల లక్ష్యం నెరవేరు తుందన్నారు. నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం తహశీల్దార్, ఆర్ఐ, వీఆర్‌వో, మండల సర్వేయర్, రిజిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్ ప్రతినిధులతో పాటు అవసరం మేరకు అటవీ, దేవదాయశాఖ అధికారులు సదస్సులకు హాజరై సంబంధిత సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. కోర్టు వివాదాలు మినహా మిగిలిన భూవివాదాలు అక్కడికక్కడే పరిష్కరించే విధంగా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. భూకబ్జాలు, ఆక్రమణలు రుజువైతే వాటికి విముక్తి కల్పించాలన్నారు. ఇళ్ల పట్టాలపై విచారణ ఉంటుందని గ్రామాలు వారీగా ఇళ్ల పట్టాల లబ్ధిదారుల జాబితాను పరిశీలించి అర్హులు, అనర్హులను గుర్తించాలని అధికారులకు సూచించారు. తొలుత గ్రామసభ వద్ద ఏర్పాటు చేసిన అర్జీల కౌంటర్, రెవెన్యూ రికార్డుల కౌంటర్, రెవెన్యూ శాశ్వత రికార్డుల కౌంటర్లను కలెక్టర్ పరిశీలించి రైతులు నుండి సమస్యల అర్జీలను స్వీకరించి స్థానిక అధికారులను పలు సూచనలు చేశారు. కలెక్టర్ వెంట కొత్తపేట ఆర్డీవో పి.శ్రీకర్, తహశీల్దార్ పి.శ్రీపల్లవి ఉన్నారు.

పరిష్కారం కాని అర్జీకు..

ఏడాది

కేక్‌తో కలెక్టరేట్‌కు వచ్చిన యువకుడు

అడ్డుకున్న పోలీసులు 7లో



ప్రత్యేక వార్తలు 6లో

క్రిస్మస్ సందడి

క్రిస్మస్ స్టార్ స్వాగతం!

ఏలేశ్వరం, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): క్రిస్మస్ వేడుకలకు క్రైస్తవ మందిరాలు సిద్ధమవుతున్నాయి. క్రైస్తవులు తమ గృహాలను సుందరంగా తీర్చిదిద్దుకుంటున్నారు. క్రీస్తు దివినుంచి భువికి ఉద్భవించినందుకు సూచనగా క్రైస్తవులు తమ గృహాలను, ప్రార్థనా మందిరాలను స్టార్‌లతో తీర్చిదిద్దుతున్నారు. ఇందులోభాగంగా కాకినాడ జిల్లా ఏలేశ్వరంలోని ఆర్‌సీఎం చర్చిగేటు వద్ద నక్షత్రాల (స్టార్) మధ్యలో పశువులపాకలో క్రీస్తు జననం దృశ్యం ఎందరినో ఆకట్టుకుంటోంది.


ఏలేశ్వరంలో ఓ చర్చి వద్ద విద్యుత్ కాంతులతో ఆకట్టుకుంటూ స్వాగతం పలుకుతున్న క్రిస్మస్ స్టార్

శాంతా క్లాజ్‌ల నృత్యాలు


అనపర్తిలో శాంతాక్లాజ్‌ల వేషధారణలో నృత్యం చేస్తూ ఆకట్టుకుంటున్న చిన్నారులు

అనపర్తి, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): క్రిస్మస్ వేడుకల సందర్భంగా తూర్పుగోదావరి జిల్లా అనపర్తిలో సోమవారం శాంతా క్లాజ్‌లు సందడి చేశారు. అనపర్తిలోని శిలువులమ్మ చర్చి, బాప్టిస్టు చర్చిల ఆధ్వర్యంలో శాంతా క్లాజ్‌ల వేషధారణలతో చిన్నారులు గ్రామంలో పర్యటించి సందడి చేశారు. ప్రధాన కూడళ్లలో డ్యాన్స్‌లు వేస్తూ చిన్నారులకు బహుమతులు అందించారు. ప్రపంచంలో ప్రజలంతా ఆనందంగా జీవించాలన్న ఆకాంక్షతో శాంతిని నింపాలన్నదే తమ లక్ష్యమని శాంతాక్లాజ్‌లు పేర్కొన్నారు.

130ఏళ్ల లూథరన్ చర్చి

జగ్గంపేట, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా జగ్గంపేట పట్టణంలో ఈ లూథరన్ చర్చికి 130ఏళ్ల చరిత్ర ఉంది. క్రిస్మస్ సందర్భంగా ప్రస్తుతం ఈ చర్చి విద్యుత్ అలంకరణలో వేడుకలకు సిద్ధమైంది. 1890లో ఈ లూథరన్ చర్చిని అప్పటి బ్రిటీష్ వారు ఐదుగురు క్రైస్తవులతో కలిసి ఏర్పాటు చేశారని, ప్రస్తుతం 1200మంది ఇక్కడకు ప్రార్థనకు వస్తున్నారని సంఘ పెద్దలు తెలిపారు. క్రిస్మస్ పండుగ వచ్చేసరికి మెట్ట ప్రాంతంలో ఈ చర్చికి ప్రత్యేక ప్రాధాన్యత ఉంది. ప్రస్తుతం రంగురంగుల విద్యుత్ దీపాలతోపాటు సంఘ పెద్దల ఆధ్వర్యంలో ప్రత్యేకంగా ఏర్పాట్లు చేశారు. క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహిస్తామని వారు తెలిపారు.


విద్యుత్ దీపాలతో జగ్గంపేటలోని సెయింట్ లూథరన్ చర్చి

మార్కెట్‌లో.. క్రిస్మస్ సందడి

- వివిధ శ్రేణుల్లో వస్తువుల ధరలు
- నక్షత్రాలు రూ.10- రూ.500 వరకు..
- క్రిస్మస్ ట్రీలు రూ.35-రూ.2500 వరకు..
- డెకరేషన్ వస్తువులు రూ.75-రూ.వెయ్యి వరకు..

కార్పొరేషన్(కాకినాడ), డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): క్రిస్మస్ వేడుకలు నెలరోజులుగా ప్రారంభమయ్యాయి. మార్కెట్‌లో క్రిస్మస్ సందడి మొదలైంది. విద్యుత్ బల్బులు, అలంకరణ సామాగ్రి కనువిందు చేస్తున్నాయి. క్రైస్తవులు వివిధ వస్తువులను కొనుగోలు చేసి గృహాలను అలంకరించుకోవడంలో నిమగ్నమవుతున్నారు. నక్షత్రాలు రూ.10 నుంచి రూ.500 వరకు, క్రిస్మస్ ట్రీలు సైజును బట్టి రూ.35 నుంచి రూ.2500 వరకు ధర పలుకుతున్నాయి. శుభాకాంక్షలతో కూడిన తోరణాలు రూ.25నుంచి రూ.100 వరకు అమ్ముతున్నారు. డెకరేషన్ వస్తువులు అయితే రూ.75నుంచి రూ.1000కు దొరుకుతున్నాయి. క్రిస్మస్ తాత డ్రెస్ రూ.275 నుంచి రూ.750 వరకు విక్రయిస్తున్నారు. క్రీస్తు ఫోటోలు, థర్మకోల్ షీట్లు, క్రిస్మస్ తాతల రూపాలను మార్కెట్‌లో అమ్ముతున్నారు. పలు రకాల క్రిస్మస్ గిఫ్ట్‌లను రూ.50 నుంచి రూ.2వేల వరకు అమ్ముతున్నారు. వేడుకలను ఘనంగా జరుపుకునేందుకు జిల్లాలో క్రైస్తవులంతా సిద్ధమవుతున్నారు. వస్తువుల ధరలు పెరిగినా కొనడానికి మక్కువ చూపుతున్నారు. గిరాకీ బాగుందని వ్యాపారులు చెపుతున్నారు. క్రిస్మస్ పండుగ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా చర్చిలను ముస్తాబు చేశారు. కాంతులీలుతున్న విద్యుత్‌దీపాలు, రంగుల బల్బులు, నక్షత్రాలు, క్రిస్మస్ ట్రీలతో అలంకరించారు.


తళుకుబెళుకులతో ఆకట్టుకుంటున్న క్రిస్మస్ ట్రీలు



ప్రత్యేక ఆకర్షణగా ఉన్న మేరీ క్రిస్మస్ స్టిక్కర్లు.. శాంతా క్లాజ్ మాస్కులు


వివిధ రంగుల్లో లభ్యమవుతున్న నక్షత్రాలు

సేవలో ఆధ్యాత్మికం

- క్రిస్మస్ వేడుకలకు ముస్తాబైన పిఠాపురం ఆంధ్ర బాప్టిస్టు సెంటినరీ చర్చి



పిఠాపురం, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మికతతోపాటు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ శతాబ్దానికి పైగా తన ప్రత్యేకతను చాటుకుంటోంది పిఠాపురంలోని పురాతనమైన చర్చి. ఈ చర్చి ఉన్న ప్రాంతాన్నే చర్చి సెంటర్‌గా వ్యవహరించడం దానికున్న ప్రాధాన్యతను చాటి చెబుతోంది. 119 ఏళ్ల క్రితం కెనడియన్లతో స్థాపించిన ఈ చర్చిలో ఏటా క్రిస్మస్, నూతన సంవత్సరంతోపాటు క్రైస్తవ పండుగలను ప్రత్యేకంగా నిర్వహిస్తారు.

జిల్లాలో అతిపురాతనమైన చర్చిల్లో ఒక్కటిగా, శతాధిక వసంతాలు చరిత్ర కలిగి పిఠాపురం పట్టణంలో ఉన్న ఆంధ్రాబాప్టిస్టు సెంటినరీ చర్చికి రాష్ట్రంలోనే ప్రత్యేక స్థానం ఉంది. రాష్ట్రం నుంచే గాక దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన క్రైస్తవులు ఈ చర్చికి వస్తూ ఉంటారు. 1905లో కెనడియన్ మిషనరీకి చెందిన ఈజే స్మిత్ ఈ చర్చిని స్థాపించారు. 1974 వరకూ ఈ చర్చి కెనడియన్స్ నేతృత్వంలోనే కొనసాగింది. ఈ చర్చిలో క్రైస్తవ ప్రార్థనలతోపాటు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. చర్చి ద్వారా పింఛన్లు పంపిణీ చేయడంతోపాటు గ్రామాల్లో సేవా కార్యక్రమాలు, ఉచిత వైద్యశిబిరాలు నిర్వహించి పేదలకు సేవలందిస్తున్నారు. ప్రతిఏటా క్రిస్మస్ సందర్భంగా చీరలు, దుప్పట్లు పంపిణీ కార్యక్రమాలు నిర్వహిస్తారు. ప్రతి ఆదివారం పిల్లలు కోసం సండే స్కూల్, యువజన సహవాసం, ఆరాధనలు జరుగుతాయి. 1954 నుంచి64 వరకూ నిమితే జాన్, 1972 వరకూ సువర్ణ రాజు చర్చి పాస్టర్లుగా వ్యవహరించారు. ప్రస్తుతం చర్చి అధ్యక్షుడిగా గుబ్బల సాల్మన్‌రాజు, చర్చి సంఘ కాపరులు(పాస్టర్లు)గా బి.థియోఫిలాస్ ఉన్నారు. క్రిస్మస్ వేడుకలకు ఈ చర్చి ముస్తాబైంది. ఇప్పటికే ఇక్కడ పిఠాపురం నియోజకవర్గస్థాయిలో ఐక్య క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ప్రస్తుతం చర్చిని విద్యుత్ దీపాలతో అలంకరించారు.

శృంగారవల్లభస్వామి హుండీ ఆదాయం రూ.28,43,967


ఆలయంలో ఆదాయాన్ని లెక్కించిన దేవదాయశాఖ అధికారులు

పెద్దాపురం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పెద్దాపురం మండలంలోని తిరుపతి శృంగారవల్లభస్వామి హుండీ ఆదాయాన్ని దేవదాయశాఖ అధికారుల సమక్షంలో సోమవారం లెక్కించారు. 93 రోజులకు అన్నదాన హుండీ ద్వారా రూ.6,74,695, హుండీల ద్వారా 21,69,272 వెరసి రూ.28,43,967 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో వడ్డి శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో దేవదాయశాఖ అధికారులు వి.ఫణీంద్రకుమార్, సాయిప్రసాద్, గ్రామ సర్పంచ్ మొయిళ్ల కృష్ణమూర్తి, దేవస్థానం మాజీ ఛైర్మన్ బందిలి సుబ్రహ్మణ్యం, అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు,నారాయణాచార్యులు ఉన్నారు.

పిఠాపురంలో శత చండీ మహాయాగం ప్రారంభం

పిఠాపురం, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం బైపాస్‌రోడ్డులో గల సద్గురు గోపాల్‌బాబా ఆశ్రమంలో 3 రోజుల పాటు నిర్వహించే శ్రీ మహారుద్ర సహిత శత చండీ మహాయాగం సోమవారం ప్రారంభమైంది. 108 యజ్ఞకుండాలతో 116మంది రుత్విక్కుల మంత్రోచ్ఛారణల మధ్య యాగాన్ని ప్రారంభించారు. రాష్ట్ర ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని, ఆది పరాశక్తి అనుగ్రహం ఈనేలపై ఉండాలని, లోకకల్యాణార్థం శ్రీ సన్నిధిసేవా ట్రస్టు ఆధ్వర్యంలో ఈ మహాయాగాన్ని నిర్వహిస్తున్నామని ట్రస్టు ప్రతినిధులు వడ్లమాని సుబ్రహ్మణ్యశర్మ అవధాని, శ్రీసన్నిధి సత్యంలు వెల్లడించారు. 50మంది మహాసిద్ధ గురువులు, యోగులు, నాగసాధువుల సమక్షంలో ఈ మహాక్రతువు జరుగుతోందని తెలిపారు.చండీయాగాన్ని తిలకించేందుకు భక్తులు అధికంగా తరలివచ్చారు. యాగంలో జనసేన పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


శత చండీ మహాయాగంలో పాల్గొన్న నాగసాధువులు, మహాసిద్ధగురువులు

జేఎన్టీయూకేలో.. డ్రోన్ టెక్నాలజీపై వర్క్‌షాప్


డ్రోన్‌లను పరిశీలిస్తున్న రామ్మోహనరావు, అతిథులు

జేఎన్టీయూకే, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): వర్శిటీలోని డిజైన్ ఇన్నోవేషన్ సెంటర్ ఆధ్వర్యంలో భారత విద్యా మంత్రిత్వ శాఖ సహకారంతో ఇంజనీరింగ్ విద్యార్థులకు డ్రోన్ టెక్నాలజీ అనే అంశంపై డీఐసీ ఇన్‌చార్జి డైరెక్టర్ ప్రొఫెసర్ ఏ.గోపాలకృష్ణ అధ్యక్షతన సోమవారం వర్క్‌షాప్ నిర్వహించారు. ఏపీఎస్సీహెచ్‌ఈ వైస్‌చైర్మన్ కె.రామ్మోహనరావు ముఖ్యఅతిథిగా, ఇన్‌చార్జి వీసీ కేవీఎస్‌జీ మురళీకృష్ణ, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ రవీంద్రనాధ్‌లు అతిథులుగా హాజరయ్యారు. ఈసందర్భంగా రామ్మోహనరావు విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ ప్రస్తుత సాంకేతిక యుగంలో డ్రోన్ టెక్నాలజీని ప్రతీ చోటా ఉపయోగించడం జరుగుతందని, అభివృద్ధి చెందిన దేశాలు ఇప్పటికే డ్రోన్ టెక్నాలజీ వినియోగంలో ముందంజలో ఉన్నాయన్నారు. చాలా ఇంజనీరింగ్ కళాశాలలు ఇప్పటికే డ్రోన్ టెక్నాలజీ ప్రయోగశాలలను ఏర్పాటుచేయడం జరిగిందన్నారు. వినూత్న ఆలోచనలతో సమాజానికి ఉపయోగపడే డ్రోన్‌లను రూపొందించేందుకు ముందుకురావాలని విద్యార్థులకు సూచించారు. వీసీ మాట్లాడుతూ ఈ వర్క్‌షాప్ ద్వారా విద్యార్థులకు డ్రోన్‌ఫ్లైట్, అసెంబ్లింగ్, ఫ్లయింగ్ టెక్నిక్స్, డ్రోన్ కాన్ఫిగరేషన్ తదితర అంశాలపై అవగాహన కలుగుతుందన్నారు. మాజీ ఉపకులపతి జీవీఆర్ ప్రసాదరాజు, డాక్టర్ మీరాసాహెబ్, అధ్యాపకులు, విద్యార్థులు ఉన్నారు.

ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఏపీఎస్సీహెచ్‌ఈ వైస్ చైర్మన్ రామ్మోహనరావు

ఎన్‌ఐఆర్‌ఎఫ్ అనేది పరీక్ష

ఎన్‌ఐఆర్‌ఎఫ్ అనేది నాయకత్వ వృత్తికి ఒక పరీక్ష వంటిదని ఏపీఎస్సీహెచ్‌ఈ వైస్ చైర్మన్ కె.రామ్మోహనరావు అన్నారు. వర్శిటీలోని అలూమ్ని ఆడిటోరియంలో ఇంటర్నల్ క్వాలిటీ అస్యూరెన్స్ సెల్ (ఐక్యూఏసీ) డైరెక్టరేట్ ఆధ్వర్యంలో డిగ్రీ, ఇంజనీరింగ్, ఫార్మసీ కళాశాలల ప్రిన్సిపాల్స్, ఐక్యూఏసీ సమన్వయకర్తలకు ఎన్‌ఐఆర్‌ఎఫ్ ర్యాంకింగ్స్ 2025లో మెరుగైన పనితీరు దిశగా వ్యూహాత్మక విధానం అనే అంశంపై సోమవారం రాష్ట్రస్థాయి వర్క్‌షాప్ నిర్వహించారు. ఐక్యూఏసీ డైరెక్టర్ ఎంహెచ్‌ఎం కృష్ణప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కె.రామ్మోహనరావు ముఖ్యఅతిథిగా, ఇన్‌చార్జి వీసీ కేవీఎస్‌జీ మురళీకృష్ణ గౌరవ అతిథిగా హాజరయ్యారు. రామ్మోహనరావు మాట్లాడుతూ రానున్న 5ఏళ్లలో ఏపీలో 15 నుంచి 20 వరకూ విదేశీ విశ్వవిద్యాలయాలు, 20 ప్రైవేట్ విశ్వవిద్యాలయాలు ఏర్పాటుకానున్నాయన్నారు. కార్యక్రమంలో మాజీ ఉపకులపతులు జీవీఆర్ ప్రసాదరాజు, వీఎస్‌ఎస్ కుమార్, ప్రిన్సిపాల్స్, విభాగాధిపతులు, అధ్యాపకులు ఉన్నారు.

సహకార సంఘాల బలోపేతానికి కార్యాచరణ సిద్ధం

తెలుగు రాష్ట్రాల కోఆర్డినేటర్ శ్రీనివాస్


చెందుర్తిలో మాట్లాడుతున్న డాక్టర్ శ్రీనివాస్

గొల్లప్రోలు రూరల్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): సహకార సంఘాల బలోపేతానికి కార్యాచరణ సిద్ధం చేస్తున్నట్టు కేంద్ర సహకార మంత్రిత్వశాఖ ఆంధ్ర, తెలంగాణ కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్‌ఎల్‌ఎన్‌టీ శ్రీనివాస్ వెల్లడించారు. కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చెందుర్తి సొసైటీలో సోమవారం రైతులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సహకార సంఘాల పనితీరు తెలుసుకునేందుకు ఉద్యోగులు, రైతులతో సమావేశమై వారి అభిప్రాయాలు సేకరించి సంఘాలను ఏ విధంగా అభివృద్ధి చేయాలనే అంశంపై నివేదిక ఇవ్వనున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో తొలుతగా చెందుర్తి సొసైటీని సందర్శించానని, కాకినాడ జిల్లాలోని 15 సొసైటీలను సందర్శించి సమావేశాలు ఏర్పాటు చేయడం ద్వారా 2వేలమందిని కలిసేలా ప్రణాళిక రూపొందించినట్టు తెలిపారు. రాష్ట్రంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జిల్లా స్థాయిలో కలెక్టర్ నేతృత్వంలో సహకార అభివృద్ధి కమిటీలు ఎప్పటికప్పుడు సంఘాల పనితీరును సమీక్షించి అభివృద్ధికి చర్యలు తీసుకుంటాయని చెప్పారు. నూతన సొసైటీల ఏర్పాటుతో పాటు నష్టాల్లో ఉన్న సొసైటీలు పునరుద్ధరించడంపై దృష్టిసారిస్తున్నామని తెలిపారు. సమావేశంలో డీసీసీబీ పిఠాపురం బ్రాంచి మేనేజరు, చెందుర్తి సొసైటీ కార్యదర్శి అనుకుల రాంబాబు పాల్గొన్నారు.

‘శ్రీప్రకాష్’లో ముగిసిన టీటీ పోటీలు

పెద్దాపురం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కాకినాడ సురేష్‌నగర్‌లో ఉన్న శ్రీప్రకాష్ సినర్జీస్ పాఠశాలలో సీతా నరసింహ క్షేత్ర మల్టీ పర్పస్ హాల్లో నిర్వహించిన అంతర్ జిల్లా రాష్ట్రస్థాయి టీటీ చాంపియన్‌షిప్ పోటీలు ఘనంగా ముగిశాయి. ఈ ముగింపు పోటీలకు ముఖ్య అతిథిగా రాజ్యసభ మాజీ సభ్యుడు కేవీపీ.రామచంద్రావు హాజరై మాట్లాడారు. క్రీడలు మానవ మేధస్సును ఉత్తేజం చేసి దేహాన్ని పటిష్టపరుస్తాయన్నారు. శాప్ డిప్యూటీ డైరెక్టర్ ఎస్వీ రమణ మాట్లాడుతూ క్రీడాకారులను ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం వారికి మరిన్ని సౌకర్యాలను కల్పించడం జరుగుతుందన్నారు. ఓఎన్జీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రత్నేష్‌కుమార్ మాట్లాడుతూ కాకినాడలో క్రీడల నిమిత్తం ఇటువంటి అత్యాధునిక హంగులతో ఉన్న మల్టీపర్పస్‌హాల్‌ను నిర్మించడం ఎంతో మంది విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. పాఠశాల డైరెక్టర్ సీహెచ్ విజయ్‌ప్రకాష్ మాట్లాడుతూ భవిష్యత్‌తరాలు గర్వించదగ్గ అత్యుత్తమ పౌరులుగా తీర్చిదిద్దడమే తమ పాఠశాల ముఖ్య ఉద్దేశ్యమన్నారు. ముఖ్య అతిథులకు పాఠశాల డైరెక్టర్ విజయ్‌ప్రకాష్, పాఠశాల జాయింట్ కార్యదర్శి సమీర జ్ఞాపికలను అందజేశారు. అలాగే ముఖ్య అతిథులు పాఠశాల యాజమాన్యాన్ని అభినందించారు. కార్యక్రమంలో ఏపీ టీటీ అసోసియేషన్ కార్యదర్శి పి.విశ్వనాథ్, వైస్ ఛైర్మన్ వి.భాస్కరరామ్, హానరరీ ఛైర్మన్ రావు చిన్నారావు, పాఠశాల సీనియర్ ప్రిన్సిపాల్ ఎంవీవీఎస్ మూర్తి, ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.


టీటీ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు






జాతీయ రైతు దినోత్సవం సందర్భంగా రైతుల వేషధారణలో పిఠాపురం భాష్యం స్కూలు విద్యార్థులు

పంచెకట్టు...తలపాగా!

రైతు వేషధారణలో అలరించిన చిన్నారులు

పిఠాపురం, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): అన్నదాతల మాదిరిగానే పంచెకట్టు, తలపాగా, చేతిలో కొడవలి, నెత్తిపై గడ్డిమోపు, గడ్డి కోస్తూ పంట పొలాల్లో ఆ చిన్నారులు చేసిన సందడి అంతా ఇంతా కాదు. జాతీయ రైతు దినోత్సవాన్ని పురస్కరించుకుని పిఠాపురం పట్టణంలోని భాష్యం స్కూలు లిటిల్‌చాంప్స్ విద్యార్థులు సోమవారం రైతుల వేషధారణలో అందరినీ అలరించారు. సంప్రదాయ వేషధారణతో పొలాల్లో హల్‌చల్ చేశారు. దేశాభివృద్ధిలో రైతులు కీలకపాత్ర పోషిస్తున్న తీరు, వారు పంటలు ఏ విధంగా పండిస్తారనే అంశాలపై చిన్నారులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో భాష్యం స్కూలు ప్రిన్సిపాల్ పోలుపర్తి వేణు, ప్రైమరీ హెచ్‌ఎం అరుణ తదితరులు పాల్గొన్నారు.

అన్నదాన భవన నిర్మాణానికి రూ.4 లక్షల విరాళం


వాడపల్లిలో దాతకు చిత్రపటం అందిస్తున్న దృశ్యం

ఆత్రేయపురం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి క్షేత్రంలో వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి విశాఖపట్నానికి చెందిన నున్న కృష్ణహనుమంతరావు(పవన్)-శిరీష దంపతులు రూ.4 లక్షలు విరాళాన్ని సోమవారం సమర్పించారు. దాతలకు వేద పండితులు ఆశీర్వచనం ఇవ్వగా ఆలయ ఉప కమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు స్వామివారి చిత్రపటం అందచేశారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

సామర్లకోట, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట కుమార రామ భీమేశ్వరాలయంలో నిత్యాన్నదాన పథకానికి కాకినాడకు చెందిన వైవీపీఎస్.ప్రసాద్ దంపతులు తమ కుమారుడు యాళ్ళ వెంకట సత్యసాయి నవీన్ పేరిట రూ.లక్ష విరాళాన్ని ఆలయ ఈవో బళ్ళ నీలకంఠానికి చెక్‌ను సోమవారం అందజేశారు. దాతలకు స్వామి, అమ్మవార్ల ప్రత్యేక దర్శనాలను చేయించి నంది మండపం వద్ద వేదాశీర్వచనంతో ప్రసాదాలు, స్వామి,అమ్మవార్ల చిత్రపటం ఇచ్చారు.

ఈ-వ్యర్థం.. అనర్థం!!



మారుతున్న కాలానికి అనుగుణంగా రోజురోజుకు ఎలక్ట్రానిక్ పరికరాల వినియోగం పెరుగుతోంది. దీనివల్ల ఎలక్ట్రానిక్ వ్యర్థాలు బాగా పెరగడంతో పూర్తిస్థాయిలో అవి పునశ్శుద్ధికి నోచుకోవడం లేదు. దీంతో భూమి, గాలి, నీరు కాలుష్యం అవుతున్నాయి. ప్రస్తుత కాలంలో చాలామంది రెండేసి ఫోన్లు, రెండు కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లు, ట్యాబ్‌లు, రెండు టీవీలు, ఇయర్ ఫోన్స్, ఛార్జర్లు, ప్రింటర్లు, జెరాక్స్ మిషన్లు ఇలా అనేక రకాలైన ఎలక్ట్రానిక్ వస్తువులను అవసరానికి మించి కొనుగోలు చేసి వాడుతున్నారు. అవి పాడైన తర్వాత పక్కన పాడేస్తున్నారు. తర్వాత వాటి పరిస్థితి ఏంటి..? వాటినే ఈ-వేస్ట్ అంటారు. దీన్ని ఏం చేయాలనే దానిపై కథనం..

- భారీగా మూలకు చేరుతున్న ఎలక్ట్రానిక్ వస్తువులు
- కొత్తవాటి రాకతో పాతవి పక్కకి..
- ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, కంప్యూటర్లు, టీవీలు, ఫ్రిడ్జ్‌లు.. అన్నింటిదీ ఇదే పరిస్థితి..
- కార్యాలయాలు, దుకాణాలు, ఇళ్లల్లో తెలియకుండానే పేరుకుపోతున్న వైనం
- పునర్వినియోగమే మేలంటున్న పర్యావరణవేత్తలు, ప్రేమికులు
- ఈ-వ్యర్థాల సేకరణకు.. కాకినాడలో మూడు కేంద్రాలు



కాకినాడ వార్పు రోడ్డులోని ఈ-వ్యర్థాల సేకరణ కేంద్రం



కలెక్షన్ సెంటర్‌లోని ఈ-వ్యర్థాలు

జేఎన్టీయూకే, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల్లో పాత కంప్యూటర్ల స్థానంలో నూతన సాంకేతికత ఆధారంగా నడిచే కంప్యూటర్లను అమరుస్తున్నారు. ఇదొక నిరంత్ర ప్రక్రియ పాతవాటిని పక్కన పడేసి.. కొత్త పెడుతుంటారు. పాత వాటిని ఏంచేయాలో పాలుపోదు. వాటిని స్టోరూంలకు పరిమితం చేయడం తర్వాత.. చెత్తగా పడేయడం జరుగుతోంది. కొంతమంది వృత్తి రీత్యా రెండు సెల్‌ఫోన్లు ఉపయోగిస్తున్నారు. అవి అలా ఉండగానే కొత్తరకం మోడల్ సెల్‌ఫోన్‌ని కొనుగోలు చేస్తున్నారు. పాతవాటిని పక్కనే పెట్టేస్తున్నారు వాటిని విక్రయిస్తే దానిలోని డేటా ఎక్కడ దుర్వినియోగమవుతుందోననే భయంతో వాటిని ఇంట్లో పక్కనే పెట్టేస్తున్నారు.

● ప్రతి ఇంట్లోను..

ప్రతి ఇంట్లోను ఇతర వ్యర్థాల కంటే ఎలక్ట్రానిక్ వ్యర్థాలే అధికంగా పేరుకుపోతున్నాయి. అవి పర్యావరణానికి ముప్పుగా మారుతున్నాయి. ఆ విధంగా ఉండే వాటిలో ఎక్కువగా కంప్యూటర్లు, సెల్‌ఫోన్లు ఉంటున్నాయి. ఈ పరికరాల్లో వినియోగించే చిప్‌లు, సెమీకండక్టర్లు పర్యావరణానికి ఎక్కువగా హాని చేస్తాయని నిపుణులు సూచిస్తున్నారు. అసోచామ్ అనే సంస్థ దేశంలో ఎలక్ట్రానిక్ వ్యర్థాల నిర్వహణపై చేపట్టిన అధ్యయనంలో ఈవ్యర్థాల ఉత్పత్తిలో మహారాష్ట్ర, తమిళనాడు తర్వాత ఏపీ ఉన్నట్లు వెల్లడించింది. ఈ నేపథ్యంలో వాటిని తగ్గించేందుకు ప్రత్యామ్నాయ మార్గాల కోసం అన్వేషించాలని పర్యావరణవేత్తలు కోరుతున్నారు.

● జిల్లాలో ఇదీ పరిస్థితి

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 2011 లెక్కల ప్రకారం 52లక్షల85వేలమంది జనాభా ఉంటే 2024 నాటికి ఈ సంఖ్య 65లక్షలకు పెరిగిందని అంచనా. అదే స్థాయిలో ప్రస్తుతం సెల్‌ఫోన్లు, కంప్యూటర్లు, రిఫ్రిజిరేటర్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాల వినియోగం పెరిగింది. వీటికి సంబంధించిన ఛార్జర్లు, బ్లూటూత్‌లు, ఇయర్‌ఫోన్లు వంటి ఉపకరణాలు వస్తున్నాయి. వాటిలో చిన్నపాటి సమస్య వచ్చినా, మార్కెట్‌లోకి కొత్త మోడల్ వచ్చినా పాత వాటిని పక్కన పెట్టేస్తున్నారు. కొత్త మోడల్ కంప్యూటర్‌లు రాగానే పాతమోడల్‌ను అటకెక్కిస్తున్నారు. ఇలా కార్యాలయాలు, కళాశాలలు, ఇళ్లల్లో పాత కంప్యూటర్లు, సీపీయూలు పేరుకుపోతున్నాయి. మౌస్‌లు, కీబోర్డులు నిరుపయోగంగా మారి పాత పర్నీచర్ మధ్యలో కనిపిస్తున్నాయి.

సేకరణకు కాకినాడలో మూడు కేంద్రాలు

కోల్‌కత్తాకు చెందిన హుల్లాడెక్ కంపెనీతో అవగాహన ఒప్పందం చేసుకుని కాకినాడలో 3 ఈ-వ్యర్థాల సేకరణ కేంద్రాలను ఏర్పాటు చేశారు. కాకినాడ వార్పు రోడ్డులో మైత్రేయి ఉమెన్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలోను, జేఎన్టీయూకేలోను, గాంధీనగర్‌లోను నిర్వహిస్తున్నారు. ఏడాదిలో రెండుసార్లు ఆ కంపెనీ ఈ-వ్యర్థాల సేకరణ కేంద్రాల ద్వారా సేకరించిన వాటిని వాహనాల్లో కంపెనీ ప్రతినిధులు తీసుకువెళ్తారు.

● పర్యావరణానికి చాలా హాని

ఇళ్లల్లో పేరుకుపోయే తడి,పొడి చెత్తతో పోలిస్తే ఎలక్ట్రానిక్ వ్యర్థాలు మరింతగా హానిచేస్తాయని పర్యావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఎలక్ట్రానిక్ వస్తువుల్లో బంగారం, వెండి, ప్లాటినం వంటి విలువైన లోహాలతోపాటు పాదరసం, తగరం, సీసం, కాడ్మియం, ఆర్సెనిక్, లిథియం, బేరియం వంటి భారలోహాలు కూడా ఉంటాయి. ఇవి జలాశయాల్లోకి చేరితే తాగునీటి కాలుష్యం అవుతుంది. నేలలోకి చేరితే భూసారం క్షీణిస్తుంది. ఎలక్ట్రానిక్ పరికరాల తయారీలో వాడే పదార్థాలు చెత్తకుప్పలోకి చేరినప్పుడు అనుకోకుండా మంట తగిలి వ్యర్థాలు దహనమవుతున్నాయి. దీంతో వాయుకాలుష్యం ఏర్పడి అనారోగ్యం బారినపడే అవకాశాలున్నాయి. శ్వాసకోశ వ్యాధులు, మానసిక ఒత్తిడి, దీర్ఘకాలిక రుగ్మతలకు లోనయ్యే ప్రమాదాలు ఉన్నాయని వైద్యులు చెబుతున్నారు.



● త్వరలో ల్యాబ్ ఏర్పాటు

-కేవీఎస్‌జీ మురళీకృష్ణ, జేఎన్టీయూకే ఉపకులపతి

ఈ-వేస్ట్‌తో కళాఖండాలను తయారు చేసే ల్యాబ్‌ను జేఎన్టీయూకేలో ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నాం. వర్సిటీ, యూసీఈకేలోని అన్నివిభాగాల నుంచి వచ్చే ఎలక్ట్రానిక్, ఎలక్ట్రికల్ వ్యర్థాలతో కళాకృతులను తయారుచేస్తారు. కేంద్రం స్వచ్ఛ పక్వాడ కార్యక్రమం ద్వారా ఈ-వేస్ట్‌మేనేజ్‌మెంట్‌పై అవగాహన కార్యక్రమాలు చేపట్టింది.

ఆన్‌లైన్‌లో పారామెడికల్ ఉద్యోగాల ప్రొవిజినల్ మెరిట్‌లిస్ట్‌లు

జీజీహెచ్(కాకినాడ), డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రంగరాయ వైద్య కళాశాల(ఆర్ఎంసీ)లో పారామెడికల్ ఉద్యోగాల నియామకం కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల ప్రొవిజినల్ మెరిట్ లిస్ట్‌లను ఆన్‌లైన్‌లో పొందుపర్చినట్లు ఆర్ఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం సోమవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఎన్ఐసీ వెబ్‌సైట్‌లో ఈ మెరిట్ లిస్ట్‌లను అభ్యర్థులు చూసుకోనేందుకు వీలుగా ప్రదర్శిస్తామన్నారు. అభ్యర్థులు ఈనెల 24 నుంచి 28 లోపు వారి వివరాలను క్షుణ్ణంగా పరిశీలించుకోవాలన్నారు. మెరిట్ లిస్ట్‌లో అభ్యంతరాలు ఉంటే రిమార్క్‌ల్లో అభ్యంతరాలు తొలగింపునకు ఆ అభ్యర్థి ఈనెల 24 నుంచి 28 లోపు లిఖితపూర్వకంగా దరఖాస్తు చేసుకుని గెజిటెడ్ అటెస్టేషన్‌తో ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల లోపు ఆర్ఎంసీ కార్యాలయంలో సమర్పించాలన్నారు.

27న రాష్ట్రస్థాయి వాలీబాల్ జట్ల ఎంపిక

కాకినాడ అర్బన్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనేందుకు రాష్ట్రస్థాయి మహిళ, పురుషుల వాలీబాల్ జట్ల ఎంపిక ఈనెల 27న విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహిస్తున్నట్టు క్రీడాపాధికార సంస్థ జిల్లా అధికారి బి.శ్రీనివాసకుమార్ తెలిపారు. జిల్లానుంచి అర్హులైన సీనియర్ వాలీబాల్ క్రీడాకారులు అర్హతపత్రాలతో హాజరవ్వాలన్నారు. ఎంపికైన క్రీడాకారులు వచ్చేనెల 7నుంచి 13 వరకు రాజస్థాన్‌లోని జైపూర్‌లో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు.

హోరాహోరీగా సాగిన రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు

- పెద్దఎత్తున తరలివచ్చిన క్రీడాభిమానులు



రావులపాలెం సీఆర్సీ క్రీడాప్రాంగణంలో కబడ్డీ పోటీల్లో తలపడుతున్న బాలికలు

రావులపాలెం, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెంలోని సీఆర్సీ క్రీడా ప్రాంగణంలో ఆంధ్ర కబడ్డీ అసోసియేషన్, సీఆర్సీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 50వ రాష్ట్రస్థాయి బాలురు, బాలికల జూనియర్ కబడ్డీ చాంపియన్‌షిప్ పోటీలు సోమవారం రెండో రోజుకు చేరుకున్నారు. పలు జట్లు గెలుపు కోసం ఆద్యంతం పోరాడాయి. పోటీలను తిలకిచేందుకు పెద్దఎత్తున క్రీడా అభిమానులు తరలివచ్చారు. ఆంధ్ర కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు గొలుగూరి వెంకటరెడ్డి, కార్యదర్శి యలమించిలి శ్రీకాంత్, సీఆర్సీ అధ్యక్షుడు తాడి నాగమోహన్‌రెడ్డి, కార్యదర్శి కర్రి అశోక్‌రెడ్డి, స్పోర్ట్స్ డైరెక్టర్ వీరరాఘవరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు.



రావులపాలెం సీఆర్సీ క్రీడాప్రాంగణంలో కబడ్డీ పోటీల్లో తలపడుతున్న బాలురు

అన్నవరంలో హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ పూజలు

అన్నవరం, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ బత్తుల తాతయ్యబాబు సోమవారం స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు ఆలయ విభాగ ఏఈవో కొండలరావు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. దర్శనానంతరం వేదపండితులు వేదాశీర్వచనాలు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ పదిలం బెనబాబు, కూటమి నాయకులు పాల్గొన్నారు.



సత్యదేవుడి దర్శనానంతరం తాతయ్యబాబు

దంత వైద్యులకు భారత్ పుట్టినిల్లు

- రాజమహేంద్రవరం ఎంపీ పురందేశ్వరి
- ఘనంగా జీఎస్ఎల్ దంత వైద్య కళాశాల గ్రాడ్యుయేషన్ డే
- ముఖ్యఅతిథులుగా హాజరైన రాజానగరం ఎమ్మెల్యే బత్తుల, రుడా ఛైర్మన్ బీవీఆర్ చౌదరి
- దంత వైద్యులకు పట్టాభిషేకం



మాట్లాడుతున్న ఎంపీ పురందేశ్వరి



పట్టాలు ప్రదానం చేస్తున్న ఎంపీ పురంధేశ్వరి, ఎమ్మెల్యే బత్తుల, రుడా ఛైర్మన్ బీవీఆర్, డాక్టర్ గన్ని భాస్కరరావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బత్తుల

రాజానగరం, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): ప్రపంచవ్యాప్తంగా అత్యధిక దంత వైద్యులు కలిగిన దేశం భారతదేశమని రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజానగరంలోని జీఎస్ఎల్ దంతవైద్య కళాశాల 7వ గ్రాడ్యుయేషన్ డే వేడుకలను స్థానిక శుశృత హాల్‌లో సోమవారం ఆమె జ్యోతిప్రజ్వలన చేసి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ భారత్‌లో మానవవనరులు పుష్కలంగా ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని వైద్యవిద్యార్థులకు సూచించారు. డబ్ల్యూహెచ్‌వో గణాంకాల ప్రకారం ప్రతి 7వేల మందికి ఒక దంత వైద్యులు ఉండగా, ఇండియాలో ప్రతి 5వేలమందికి ఒక దంత వైద్యులు ఉన్నారన్నారు. మరో ముఖ్య అతిథి ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ మాట్లాడుతూ వైద్యరంగానికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం కల్పించడంతోపాటు రాష్ట్రవ్యాప్తంగా మరిన్ని వైద్యకళాశాలలు ఏర్పాటు చేసే దిశగా కృషి చేస్తోందన్నారు. యువ వైద్యులు సేవా దృక్పథంతో సేవలందించాలన్నారు. మరో ముఖ్యఅతిథి రుడా ఛైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి మాట్లాడుతూ వైద్యరంగంలో ఎదురయ్యే సవాళ్లు, ఒత్తిళ్లను అధిగమిస్తూ జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. అనంతరం దంత విద్యను పూర్తి చేసిన యువ వైద్యులకు పట్టాలు ప్రదానం చేశారు. ముఖ్యఅతిథులను జీఎస్ఎల్ యాజమాన్యం సత్కరించింది. కార్యక్రమంలో జీఎస్ఎల్ వైద్యవిద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ గన్ని సందీప్, డాక్టర్ తరుణ్, మెడికల్ సూపరింటెండెంట్ టీవీఎస్‌పీ మూర్తి, ప్రిన్సిపాల్ గంటా సునీల్, వైస్ ప్రిన్సిపాల్ గోవిందరాజు, హెచ్‌వోడీలు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి విలేకరి హత్య కేసులో ఆధారాలు ఉంటే ఇవ్వండి

- తుని పోలీసులు



విలేకరులతో మాట్లాడుతున్న తుని పట్టణ, రూరల్ సీఐలు

తుని రూరల్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): తుని రూరల్ ఎస్.అన్నవరం గ్రామంలో అతి కిరాతకంగా హత్యకు గురైన ఆంధ్రజ్యోతి రిపోర్టర్ కాతా సత్యనారాయణ కేసుకు సంబంధించి ఆధారాలు ఉంటే ధైర్యంగా పోలీసులకు సమర్పించాలని, వారి వివరాలు గోప్యంగా ఉంటాయని తునిరూరల్ సీఐ చెన్నకేశవరావు స్పష్టం చేశారు. ఈమేరకు తుని రూరల్ సర్కిల్ ఆఫీస్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. 2019లో జరిగిన ఆంధ్రజ్యోతి విలేఖరి హత్యకు సంబంధించి సీఐడీ విచారణ లోతుగా జరుగుతోందని, హత్యకుగల కారకులకు తొందరలోనే శిక్షిస్తామని ఆయన తెలిపారు. గతంతో పోలిస్తే ఇప్పుడు తుని నియోజకవర్గంలో క్రైం రేట్ సగానికి తగ్గిందని, తునిలో ప్రశాంత వాతావరణం నెలకొనడం శుభపరిణామం అన్నారు. గతం మాదిరిలా తునిలో తప్పుడు కేసులు ఉండవన్నారు. పండుగలు పురస్కరించుకుని గుండాట, కోడి పందేలు నిర్వహించడం నేరమని, పబ్లిక్ ప్లేసుల్లో ర్యాలీలు, ఊరేగింపులు, మతపరమైన కార్యక్రమాలు నిర్వహించుకోదలిస్తే అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని తెలిపారు. సాధ్యమైనంత వరకు ఇళ్లవద్ద సీసీ కెమెరాలు అమర్చుకునేందుకు అందరూ చొరవ చూపాలన్నారు. సోషల్ మీడియాలో వ్యక్తిగత దూషణ గానీ, నిరాధారమైన ఆరోపణలు గానీ చేస్తే పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేస్తామన్నారు. సైబర్‌నేరస్తులపట్ల పౌరులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. హైకోర్టు ఇచ్చిన ఆదేశాల ప్రకారం ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ వినియోగించాలన్నారు. పట్టణ సీఐ గీతారామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

ఏడాదైనా సమస్య పరిష్కరించలేదు

- అధికారుల తీరుకు నిరసనగా.. కలెక్టరేట్‌లో కేక్ చేసేందుకు ప్రయత్నం
- అడ్డుకుని స్వాధీనం చేసుకున్న పోలీసులు



అధికారులతో కట్ చేయించేందుకు సిద్ధం చేసిన కేక్



కేక్ తీసుకువచ్చిన కోట చంద్రశేఖర్, షేక్ రెహ్మాతుల్లా షరీఫ్

అమలాపురం టౌన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆక్రమణలు తొలగించి ముంపు సమస్యను పరిష్కరించాలని కోరుతూ ఏడాది క్రితం అర్జీ అందించారు. మళ్లీ పలుసార్లు అర్జీలు ఇచ్చినా పంచాయతీ అధికారులు ఎప్పటికప్పుడు ఆ అర్జీలను పరిష్కరించినట్టు చూపుతూ క్లోజ్ చేస్తున్నారు. ఇటీవల జిల్లా పంచాయతీ అధికారి సైతం ఇదేవిధంగా చేయడంతో ఆవేదన చెందిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం మండలం రావులపాడు గ్రామానికి చెందిన తెలుగు యువత మండల శాఖ అధ్యక్షుడు కోట చంద్రశేఖర్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో వినూత్నంగా ఏడాది కాలమైనా అర్జీని పరిష్కరించలేదని చెబుతూ 'పిటిషన్ ఫస్ట్ యానివర్శరీ' పేరిట కేక్‌ను సిద్ధం చేసి పంచాయతీ అధికారులతో కట్ చేయించేందుకు తీసుకువచ్చారు. అప్పటికే సమాచారం తెలుసుకున్న పోలీసులు రంగ ప్రవేశం చేసి గ్రీవెన్స్‌లో కేక్ తీసుకువచ్చిన వారిని గుర్తించారు. కేకుతోపాటు రావులపాలెం గ్రామానికి చెందిన వాసంశెట్టి నాగేశ్వరరావును అదుపులోకి తీసుకుని బయటికి తీసుకువచ్చారు. చంద్రశేఖర్ మరోసారి అర్జీని అందించి బయటకి వచ్చి తమ గోడును వివరించారు. గతేడాది ఇదే డిసెంబరు నెలలో రావులపాడులోని దుర్గావతి ఆస్పత్రి వీధిలో ఉన్న ఆక్రమణలు తొలగించి ముంపునీటి సమస్యను పరిష్కరించాలని అర్జీ అందించామన్నారు. అప్పట్లో పంచాయతీ కార్యదర్శి ఎం.సాయిపట్టాభిరామయ్య విచారణ జరిపి ఆక్రమణదారులకు నోటీసులు జారీ చేశారు. ఆక్రమణలు తొలగించని పక్షంలో పంచాయతీరాజ్ చట్టాన్ని అనుసరించి క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అప్పట్లో ఇచ్చిన అర్జీ మేరకు తనను కలుసుకున్న పంచాయతీ కార్యదర్శి నెల రోజుల వ్యవధి ఇవ్వాలని కోరారు. ఆ మేరకు లిఖిత పూర్వక లేఖను సైతం అందజేశారు. ఏడాది పూర్తి అవుతున్నా ఇంతవరకు ఆక్రమణలు తొలగించలేదన్నారు. ఈనెల 2న చంద్రశేఖర్ మరోసారి కలెక్టరేట్‌లో అర్జీ అందించారు. సమస్యను పరిష్కరించను లేదు. అర్జీదారుని సంప్రదించకుండానే సమస్య పరిష్కరించినట్టు జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయం నుంచి మెస్సేజ్ వచ్చిన తీరును ఆయన తప్పుబట్టారు. సమస్య పరిష్కరించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమస్య పరిష్కారానికి అవసరమైతే కోర్టును ఆశ్రయిస్తామని చంద్రశేఖర్, టీడీపీ మైనార్టీసెల్ అధ్యక్షుడు షేక్ రెహ్మతుల్లాషరీఫ్ పేర్కొన్నారు.

6నుంచి యానాం ప్రజా ఉత్సవాలు

- పుదుచ్చేరి సీఎం, గవర్నర్‌ల పర్యాటనలు ఖరారు
- 6న సీఎం, 8న గవర్నర్ రాక



గవర్నర్‌తో చర్చిస్తున్న ఢిల్లీ ప్రతినిధి మల్లాడి

యానాం, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): యానాంలో ప్రతిఏటా జనవరి 6నుంచి 8వరకు ప్రతిష్టాత్మకంగా జరిగే యానాం ప్రజాఉత్సవాలకు పుదుచ్చేరి గవర్నర్, సీఎం పర్యటనలు ఖరారైనట్లు పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు తెలిపారు. ఈ మేరకు పుదుచ్చేరి వెళ్లిన ఆయన గవర్నర్ కైలాష్‌నాథ్, సీఎం ఎన్.రంగసామితో భేటీ అయ్యారు. యానాంకు సంబంధించిన అనేక పెండింగ్ అంశాలపై చర్చించడంతోపాటు వినతిపత్రం ఇచ్చానన్నారు. 6న యానాం ప్రజా ఉత్సవాల ప్రారంభ వేడుకలకు ముఖ్యఅతిథిగా పుదుచ్చేరి ముఖ్యమంత్రి ఎన్.రంగసామితోపాటు మత్స్యశాఖ, వ్యవసాయ, పౌరసరఫరాలశాఖ మంత్రులు హాజరు కానున్నారు. 8న జరిగే ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గవర్నర్ కైలాష్ నాథ్, పర్యాటకశాఖ మంత్రి లక్ష్మీనారాయణ, గవర్నర్ కార్యదర్శి హాజరుకానున్నారన్నారు. వీటికి సంబంధించిన అంశాలపై చర్చించామన్నారు. యానాంకు సంబంధించి మాస్టర్ ప్లాన్ తదితర పెండింగ్ అంశాలపై వివరించారు.

గంజాయితో ఒకరి అరెస్టు

ఆలమూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు ఏటిగట్టుపై నుంచి గంజాయి అమ్మకానికి తరలిస్తుండగా పోలీసులు దాడి చేసి ఒకరిని అరెస్టు చేశారు. ఆలమూరు ఎస్ఐ ఎం.అశోక్ ఆధ్వర్యంలో సిబ్బంది ఆలమూరువద్ద ఏటిగట్టుపై స్థానికుడు బాడితిపోయిన గణేష్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతడినుంచి 470గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. గంజాయి సరఫరా చేస్తున్న వారి వివరాలు సేకరిస్తున్నామని, పూర్తి వివరాలు రాగానే కేసు నమోదు చేయనున్నామని తెలిపారు. గంజాయితో అరెస్టు చేసిన సమయంలో తహశీల్దార్ కెజె.ప్రకాష్‌బాబు, ఎస్ఐ ఎం.అశోక్, వీఆర్వో భారతి, వీఆర్ఏ నాగేశ్వరరావు, పోలీస్ సిబ్బంది ప్రభాకర్, రవికుమార్, సురేంద్ర పాల్గొన్నారు.

లే నాన్నా..ఇంటికెళ్దాం..!

- టిప్పర్ లారీ ఢీకొని తల్లి కళ్లెదుటే కుమారుడి మృతి
- కన్నీటి పర్యంతమైన తల్లి

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): తల్లీకొడుకులు వెళ్తున్న ద్విచక్రవాహనానికి ఒక లారీ అడ్డుగా వచ్చింది. అమ్మా.. అంటూ రోడ్డుపై అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు.. ఆ యువకుడిని తల్లి బిగ్గరగా లే.. నాన్నా ఇంటికెళ్దాం.. అన్నా కదలికలేదు. దీంతో తల్లి బోరున విలపించిన హృదయవిదారక ఘటన ఇది. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం రూరల్ మండలం పిడింగొయ్యి గ్రామానికి చెందిన ఎల్.నరేష్(20) తన తల్లి సత్యవతితో కలిసి బ్యాంక్ పని నిమిత్తం బుల్లెట్‌పై మోరంపూడి సెంటర్‌కు బయలుదేరారు. పిడింగొయ్యి జాతీయ రహదారి సెంటర్ వద్ద మలుపులోకి వచ్చేసరికి లాలాచెరువు వైపు నుంచి వస్తున్న టిప్పర్ లారీ ఢీకొంది. దీంతో బుల్లెట్ అదుపు తప్పి సత్యవతి కిందపడిపోగా నరేష్ ఆ బండి ట్యాంక్, హ్యాండిల్‌కు చాతితో గుద్దుకుని అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. వెంటనే తల్లి స్థానికుల సహకారంతో ప్రభుత్వాస్పత్రికి తరలించింది. పరిస్థితి విషమించి నరేష్ మృతి చెందాడు. సత్యవతికి భర్త గతంలోనే మరణించారు. వీరికి ఇద్దరు కుమారులుండగా నరేష్ చిన్నవాడు. మృతదేహాన్ని పట్టుకుని తల్లి రోధించిన తీరుచూపరులను కంటతడి పెట్టించింది. బొమ్మూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

అంతర్వేది, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): అంతర్వేది దేవస్థానంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో సోమవారం క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించికేక్ కట్ చేశారు. మండలంలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో క్రిస్మస్ వేడుకలు జరిగాయి. హెచ్ఎం ఒ.వరలక్ష్మి, శ్రీవిద్య, భారతి పాల్గొన్నారు.

కోడిపందేల శిబిరంపై దాడి

అంబాజీపేట, డిసెంబరు23(ఆంధ్రజ్యోతి): గంగలకుర్రు అగ్రహారం కౌశికగట్టు వద్ద కోడిపందేల శిబిరంపె ఎస్ఐ కె.చిరంజీవి, సిబ్బంది దాడిచేసి చాట్ల వీరాంజనేయులు, ఈతకోట ధనప్రసాద్‌ను అరెస్టు చేశారు. 2కోళ్లు, 2కత్తులు, రూ.2140 స్వాధీనం చేసుకున్నారు. బండారు సూరిబాబు తప్పించుకున్నాడని, ముగురిపై కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

ప్రజాప్రతినిధులకు సమస్యలపై అవగాహన ఉండాలి

- మండల పరిషత్ సమావేశంలో ఎమ్మెల్యే దేవ వరప్రసాద్



మండల పరిషత్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

మలికిపురం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పరిపాలన అంశాలపై ప్రజాప్రతినిధులు అవగాహన పెంచుకోవాలని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. మలికిపురంలో సోమవారం ఎంపీపీ ఎంవీ సత్యవాణి అధ్యక్షతన జరిగిన మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులకు సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులు తప్పనిసరిగా హాజరు కావాలని, రెవెన్యూ అంశాలపై అవగాహన పెంచుకుని రెవెన్యూ సమస్యల పరిష్కారంలో ముందుండాలన్నారు. సమస్యల పరిష్కారానికి ముందున్న నాడే ప్రజల్లో మంచి గుర్తింపు వస్తుందన్నారు. తాను మూడు నెలల పాటు ప్రణాళికాబద్ధంగా పనిచేసి గోదావరి డెల్టా ప్రాజెక్టు చైర్మన్ పదవిని నియోజకవర్గానికి తీసుకువచ్చానని తద్వారా నియోజకవర్గంలో ఉన్న ఆయకట్టు శాతాన్ని పెంచాలన్నదే తన ధ్యేయమన్నారు. రాజోలు నియోజకవర్గంలో 13వేల ఎకరాల్లో రిజిస్టర్ ఆయకట్టు ఉంటే మూడో వంతు కూడా ఊడ్పులు జరగడం లేదని, కాల్వలు, డ్రైనేజీ వ్యవస్థ పాడైపోయిందన్నారు. మార్చి నాటికి విద్యుత్ సమస్యలు దాదాపుగా పరిష్కారమవుతాయని చెప్పారు. సమావేశంలో సర్పంచ్‌లు యెనుముల నాగు, చెల్లుబోయిన హెలీన, గెడ్డం రాజ్యలక్ష్మి, ఆరేటి రంగ, ఎంపీటీసీ జక్కంపూడి శ్రీదేవి తదితరులు పలు సమస్యలను సమావేశం దృష్టికి తెచ్చారు. సమావేశంలో ఎంపీపీ ఎంవీ సత్యవాణి, గుండుబోగుల పెద్దకాపు, పినిశెట్టి బుజ్జి, తహశీల్దార్ టి.శ్రీనివాసరావు, ఎంపీడీవో బాలాజీ, ఏవో మిల్టన్, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మా సమస్యలు పరిష్కరించరూ..

- కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్‌లో సమస్యలపై అర్జీలు అందించిన పలు గ్రామాల ప్రజలు, ప్రజాప్రతినిధులు, రైతులు



కలెక్టరేట్ వద్ద వివిధ గ్రామాల సర్పంచ్‌లు, రైతులు

అమలాపురం టౌన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కోటిపల్లి-నర్సాపురం రైల్వేలైన్‌కు 18ఏళ్ల క్రితం సూచించిన పాత రైల్వేలైన్‌ను కాదని కొత్తగా రైల్వేలైన్ ప్రతిపాదనలు చేయడం వల్ల ఏర్పడుతున్న ఇబ్బందులను వివరిస్తూ మండల పరిధిలోని పలు గ్రామాల ప్రజలు, ప్రజాప్రతినిధులు, రైతులు సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్‌లో అర్జీ అందించారు. నూతన రైల్వేలైన్ ప్రతిపాదన వల్ల పదమూడు గ్రామాల ప్రజలకు తాగునీటిని అందిస్తున్న చిందాడమడుగు దెబ్బతినే ప్రమాదం ఉందని, ఇప్పటికే బైపాస్ రోడ్డుకు భూములు ఇచ్చి కోల్పోయామని, మళ్లీ రైల్వేలైన్ కోసం భూములను సేకరిస్తే మరింత నష్టపోతామని వివరించారు. మంచినీటి ప్రాజెక్టు ప్రాంతంలో లూజ్ సోయిల్ వల్ల రైల్వేలైన్ ఏర్పాటు చేసే పరిస్థితి అంతగా ఉండదని పేర్కొన్నారు. ఉన్నతాధికారులు స్పందించి పాత రైల్వేలైన్‌ను పునరుద్ధరించాలని చిందాడగరువు, రోళ్లపాలెం సర్పంచ్‌లు పొణకల గణేష్, మట్ట వైదేహి, నాయకులు రంకిరెడ్డి సూర్యనారాయణ, తిరుమనాథం మురళీ, రేకపల్లి సోము, ఎన్వీ సీతామహాలక్ష్మి తదితరులు అర్జీ అందించారు.

నారుమడులు వేయాలా వద్దా : బొక్కా శ్రీనివాస్, అల్లవరం మండలం

మేజర్ డ్రెయిన్లలో వలకట్లు ఏర్పాటు చేయడంతో పాటు రెవెన్యూ డ్రెయిన్లలో ఆక్వా చెరువుల స్లడ్జ్‌ను విడిచిపెట్టడం వల్ల మండల పరిధిలోని పలు గ్రామాల రైతులు సాగు చేయాలో వద్దో తెలియని పరిస్థితి ఏర్పడిందని అర్జీ అందించారు. ఇప్పటికే తొలకరి పంట వేయలేదు. దాళ్వా సాగు చేసే పరిస్థితులు కనిపించడం లేదు. ఇప్పటి వరకు నారుమడులు కూడా వేసుకోలేకపోయాం. మేజర్ డ్రెయిన్లలో గుర్రపుడెక్క, తూడు తొలగించడంతో పాటు ఎక్కడా చేపల వలకట్లు లేకుండా చూడాలని అప్పుడే సాగు చేసుకునే పరిస్థితి ఉంటుందని బొక్కా శ్రీనివాస్ ఆధ్వర్యంలో రైతులు వాసర్ల సూర్యనారాయణ, ఎన్ఎస్ రాజు, మొల్లేటి రామకుమార్, కుడుపూడి వెంకటశెట్టి తదితరులు అర్జీ అందించారు.

డంపింగ్ యార్డుకు మరో చోట స్థల సేకరణ చేయాలి : ద్రాక్షారామ వాసులు

ద్రాక్షారామ పంచాయతీ పరిధిలో డంపింగ్ యార్డు ఏర్పాటును నిలుపుదల చేయాలని కోరుతూ గ్రామస్థులు అర్జీ అందించారు. డంపింగ్ యార్డు ఏర్పాటు వల్ల పంట భూములు దెబ్బతినే పరిస్థితులు ఉన్నాయని, మరోచోట డంపింగ్ యార్డు ఏర్పాటు చేయాలని పెద్దిరెడ్డి సూర్యనారాయణ, పి.సత్యనారాయణమూర్తి, వి.రామకృష్ణ తదితరుల ఆధ్వర్యంలో అర్జీ అందించారు.

వరిచేల మీదుగా కొత్త రహదారి నిర్మించాలి: బాబూజగ్జీవన్‌రామ్ వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధులు

రావులపాలెం నుంచి బోడసకుర్రు వరకు ఆరు లైన్ల రోడ్డు నిర్మాణంలో భాగంగా నడిపూడి మెట్ల కాలనీ సమీపంలో ఉన్న డాక్టర్ బాబూజగ్జీవన్‌రామ్ కమ్యూనిటీ హాలు తొలగించే పరిస్థితి ఏర్పడిందని సొసైటీ ప్రతినిధులు మోకాటి నాగేశ్వరరావు, నేదునూరి వెంకట్రావు, మోకాటి రమేష్‌బాబు ఆధ్వర్యంలో అర్జీ అందించారు. 18ఏళ్ల ఎంతో శ్రమించి దివంగత లోక్‌సభ స్పీకర్ జీఎంసీ బాలయోగి కృషితో, ఎంపీ, ఎమ్మెల్యేల నిధులతో కమ్యూనిటీ హాలును నిర్మించుకున్నామని పక్కనే ఉన్న పంట చేల మీదుగా రహదారి వెళ్లేలా సర్వేలో మార్పులు చేయాలని కోరారు.

మారిన వాతావరణంతో రైతుల దిగాలు



మామిడికుదురులో ధాన్యంపై బరకాలు కప్పుకుంటున్న రైతులు

మామిడికుదురు, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): వాయుగుండం ప్రభావంతో సోమవారం ఒక్కసారిగా చిరుజల్లులు పడడంతో రైతులు దిగాలు చెందారు. దాళ్వా పంట చేతికి వచ్చే సమయంలో మూడు పర్యాయాలు వాయుగుండాల ప్రభావంతో వర్షాలు కురవడం వల్ల ఆర్థికంగా నష్టం వాటిల్లే పరిస్థితి ఏర్పడిందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంట చేతికి వచ్చి ధాన్యాన్ని అమ్ముకునే సమయంలో సోమవారం ఒక్కసారిగా వాతావరణం మారడంతో రైతులు ధాన్యం రాశులను రక్షించుకునే పనిలో పడ్డారు. పండించిన ధాన్యాన్ని పోగు చేసుకుని బరకాలు కప్పుకునే పనిలో నిమగ్నమయ్యారు. సార్వా నారుమడులు వేసే సమయంలో, కోత కోసే సమయంలో, ధాన్యం ఒబ్బిడి చేసుకనే సమయంలో వర్షం తమ పాలిట శాపంగా మారిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏదైమైనప్పటికీ సార్వా పంటకు వాయుగుండాల రూపంలో నష్టాలు మిగిల్చిందని వాపోతున్నారు.

వ్యవసాయ పనులకు ఆటంకం

ఉప్పలగుప్తం, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): వరుస అల్పపీడనాల బెడదతో సార్వా కోతలు నిలిచిపోయాయి. దాళ్వా పనులకు అడ్డంకి ఏర్పడింది. అయితే ఆదివారం వాతావరణంలో స్వచ్ఛత ఏర్పడి పూర్తి స్థాయిలో ఎండ రావడంతో రైతులు మళ్లీ సార్వా కోతలు, దాళ్వా సాగు పనులకు ఉపక్రమించారు. మళ్లీ సోమవారం వాతావరణం ఒక్కసారిగా మళ్లీ మారింది. ఉదయం నుంచి వర్షం కురవడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. ఎన్నడూ లేని విధంగా అల్పపీడన వర్షాలు వ్యవసాయాన్ని దెబ్బ కొడుతున్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. వరి చేలల్లో పైరును తక్షణం కోసి ఒడ్డుకు చేర్చకపోతే పైరు కుంగి దిగుబడులు తగ్గడమే కాకుండా ధాన్యం నాణ్యత తగ్గే అవకాశముందని రైతులు భయపడుతున్నారు.

మేనేజ్‌మెంట్ రంగంలో మార్పులకు అనుగుణంగా శిక్షణ పొందాలి



బీవీసీ కళాశాలలో వర్క్‌షాపులో మాట్లాడుతున్న నాగార్జున కనస్ట్రక్షన్స్ చైర్మన్ దుర్గాప్రసాద్

అమలాపురం, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): గ్లోబల్ ప్రపంచంలో మేనేజ్‌మెంట్ రంగంలో వస్తున్న మార్పులను గమనిస్తూ అందుకు అనుగుణంగా శిక్షణ పొందాలని నాగార్జున కనస్ట్రక్షన్స్ కంపెనీ చైర్మన్ డాక్టర్ ఏఎస్ దుర్గాప్రసాద్ పేర్కొన్నారు. భట్లపాలెం బీవీసీ ఇంజనీరింగ్ కళాశాలలోని సెమినార్ హాలులో సోమవారం మేనేజ్‌మెంట్ స్టడీస్ డిపార్టుమెంటు ఆధ్వర్యంలో ఎంబీఏ విద్యార్థులకు ఒకరోజు వర్క్‌షాపు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా దుర్గాప్రసాద్ మాట్లాడుతూ యూనివర్సిటీలు అందించే సిలబస్‌లో వాస్తవ అవసరాలు, ఉద్యోగ రంగంలో వస్తున్న మార్పులను గమనిస్తూ నైపుణ్యాలను ఏవిధంగా పెంపొందించుకోవాలో వివరించారు. మేనేజ్‌మెంట్ విభాగ అధ్యక్షుడు డాక్టర్ గోకరకొండ నాగేంద్ర అధ్యక్షతన జరిగిన సమావేశంలో కళాశాల కార్యదర్శి బోనం కనకయ్య, అధ్యక్షుడు బోనం కృష్ణసతీష్, వైస్ ప్రిన్సిపాల్ ఎంసీఎస్ మదన్, డాక్టర్ ఏఎస్ నారాయణ, పేరి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. దుర్గాప్రసాద్‌ను సత్కరించారు.

ఇందుపల్లి విద్యార్థులకు పతకాలు

అమలాపురం రూరల్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కృష్ణా జిల్లా కృష్ణలంకలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో ఇందుపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు పతకాలు సాధించినట్టు హెచ్ఎం వి.శ్రీనివాసరావు తెలిపారు. అండర్-17 విభాగంలో పదో తరగతి విద్యార్థి జల్లి జితేంద్రదొర ప్రథమస్థానంతో స్వర్ణ పతకం, కడిమి నాని, వేంద్ర సోమశేఖర్ ద్వితీయస్థానంతో రజత పతకాలు దక్కించుకున్నారు. అలాగే జిల్లా పవర్‌లిఫ్టింగ్ జట్టు టీమ్ చాంపియన్ షిప్‌ను దక్కించుకున్నట్టు కోనసీమ పవర్‌లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు యెనుముల కృష్ణపద్మరాజు తెలిపారు. క్రీడాకారులను, శిక్షణ ఇచ్చిన పీఈటీలు వి.బుజ్జి, రత్నకుమారి, కోచ్ వి.నరేష్, ఎం.వీరేంద్రలను హెచ్ఎం, సర్పంచ్ చొల్లంగి శివాళినీ అప్పాజీ, ఎస్ఎంసీ చైర్మన్ పి.మంగతాయారు, జిమ్ కోచ్ కంకిపాటి వెంకటేశ్వరరావు అభినందించారు.

మధ్య డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ గుబ్బలకు సన్మానం



శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న నాయకులు, కార్యకర్తలు

రాజోలు, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): గోదావరి మధ్య డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్‌గా ఎన్నికైన గుబ్బల శ్రీనివాస్‌ను రాజోలు నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు సోమవారం ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ గుబ్బల మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన సీఎం చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి, మంత్రి వాసంశెట్టి సుభాష్, రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్, రాష్ట్ర పొలిట్‌బ్యూరో సభ్యుడు రెడ్డి సుబ్రహ్మణ్యంతో పాటు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఎమ్మెల్యేలకు కృతజ్ఞతలు తెలిపారు. నీటి వనరుల సంరక్షణ, నిర్వహణకు ఇబ్బంది కలగకుండా చూస్తానన్నారు. శివారు ప్రాంత భూములకు సాగునీరు అందించడమే లక్ష్యంగా తాను శాయశక్తులా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ముదునూరి రామకృష్ణంరాజు(చంటిబాబు), మలికిపురం, సఖినేటిపల్లి మండలాల టీడీపీ అధ్యక్షులు అడబాల యుగంధర్, ముప్పర్తి నాని, మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి చాగంటి స్వామి, పిండి సత్యనారాయణ, కడలి అబ్బు, మామిడిశెట్టి నాగరాజు, కడలి మోహన్, గుబ్బల కుమార్, కడలి వెంకటరమణారావు తదితరులు అభినందించారు.

పాఠశాలలు విధిగా ఆదేశాలు పాటించాలి

ముమ్మిడివరం, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని ప్రైవేటు యాజమాన్య పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులకు తరగతుల నిర్వహణ విషయంలో విద్యాశాఖ ఆదేశాలను తూచా తప్పక పాటించాలని డీఈవో షేక్ సలీంబాషా సూచించారు. అకడమిక్ కేలండర్‌లో సూచించిన విధంగా ప్రైవేటు పాఠశాలలు (పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించడం వల్ల వారికి మినహాయింపు) సమయాలు పాటించాలన్నారు. టైమ్‌టేబుల్ ప్రకారం విద్యార్థులకు ఇచ్చే స్వల్ప విరామ సమయాలు, మధ్యాహ్న భోజన సమయాలు ఖచ్చితంగా పాటించాలన్నారు. స్వల్పవిరామ సమయంలో విద్యార్థులకు స్వచ్ఛమైన మంచినీరు, టాయిలెట్ సదుపాయాలు కల్పించాలన్నారు. స్కూలు టైమ్‌టేబుల్‌లో విద్యార్థులకు కేటాయించిన క్రీడా సమయాన్ని పాటించాలన్నారు.

అనధికార ఆక్వా చెరువుల తొలగింపు



కరవాకలో అనధికార ఆక్వా చెరువులకు గండి కొడుతున్న దృశ్యం

మామిడికుదురు, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాల మేరకు కరవాక గ్రామంలోని అనధికార చెరువుల తొలగింపు పనులను అధికారులు సోమవారం చేపట్టారు. సీఆర్‌జెడ్ పరిధిలోని 18ఎకరాల విస్తీర్ణంలో గల చెరువులను తొలగించేందుకు మత్స్యశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ వర్ధన్ ఆధ్వర్యంలో పనులను చేపట్టారు. గొల్లపాలెం గ్రామంలో 12ఎకరాల్లో గల పంతొమ్మిది చెరువులను రెండు రోజుల నుంచి తొలగిస్తున్నారు. సోమవారం కరవాకలోని అనధికార చెరువులను పోలీసు బందోబస్తు నడుమ జేసీబీతో గట్లకు గండ్లు కొట్టారు. కార్యక్రమంలో వివిధ శాఖల ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

'అమిత్‌షాను మంత్రి పదవి నుంచి తొలగించాలి'



నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

అమలాపురం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను తక్షణం మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తూ అమలాపురం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. తొలుత అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. హోంమంత్రి అమిత్‌షా భారతజాతికి తక్షణం క్షమాపణ చెప్పాలని, సుమోటోగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది డీబీ లోక్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వీరిన సాయి, ప్రధాన కార్యదర్శి నందిక శ్రీనివాస్, న్యాయవాదులు కటికదల సత్యనారాయణ, పెయ్యల సత్యనారాయణ, నల్లా ప్రభాకర్‌తో పాటు పలువురు పాల్గొన్నారు. జిల్లా షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గడియార స్తంభం సెంటర్‌లో నిరసన ప్రదర్శన జరిపారు. ప్రధాన కార్యదర్శి గోసంగి బంగార్రాజు ఆధ్వర్యంలో జరిగిన నిరసనలో కేంద్రమంత్రి అమిత్‌షాపై దేశ ద్రోహం కింద కేసు నమోదు చేయాలని, అమిత్‌షా డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేశారు. సీహెచ్ మేరీమాత, కత్తుల సౌజన్య, బొంతు వరలక్ష్మి, వాకపల్లి సుజాత, పి.అరుణకుమారి, సీహెచ్ సుజాత, అనూష, కుమారి పాల్గొన్నారు.

జాతీయ రైతు దినోత్సవం

అమలాపురంటౌన్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): ది అమలాపురం చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో సోమవారం జాతీయ రైతు దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, అమలాపురం అర్బన్ డెవలెప్‌మెంట్ అథారిటీ చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, చాంబర్ ఫౌండర్ గోకరకొండ హరిబాబులు రైతులు చేస్తున్న సేవలను వివరించారు. అనంతరం చాంబర్ అధ్యక్షుడు బోనం సత్యవరప్రసాద్ ఆధ్వర్యంలో రైతు ప్రతినిధులు మట్టా మహాలక్ష్మిప్రభాకరరావు, వేగిరాజు సత్యనారాయణరాజు, వాసంశెట్టి చినబాబు, సత్తి వెర్రిబాబు, మెండి రాజును సత్కరించారు.

కేంద్ర ప్రభుత్వ వ్యవసాయ నల్ల చట్టాలను రద్దు చేయాలి

కలెక్టరేట్ ఎదుట ప్రతుల దహనం



కలెక్టరేట్ ఎదుట నల్ల చట్టాల ప్రతులను దహనం చేస్తున్న ఎస్కేఎం ప్రతినిధులు

అమలాపురం టౌన్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రైతు సంఘాల సమన్వయ సమితి (ఎస్కేఎం) పిలుపు మేరకు కలెక్టరేట్ ఎదుట జిల్లా శాఖ ఆధ్వర్యంలో రైతు, కార్మిక, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సోమవారం నిరసన తెలిపారు. వ్యవసాయ రంగంలోకి కార్పొరేట్లు స్వేచ్ఛగా చొరబడేలా, మార్కెట్‌ను హస్తగతం చేసుకునేందుకు వీలుగా మోడీ ప్రభుత్వం చట్టాల్లో సమూల మార్పులు తీసుకువస్తుందని సమన్వయ సమితి నాయకులు కె.సత్తిబాబు, కారెం వెంకటేశ్వరరావు, చెల్లుబోయిన కేశవశెట్టి ఆరోపించారు. వ్యవసాయ నల్ల చట్టాలను ఉపసంహరించుకున్నట్టు నటించిన కేంద్ర బీజేపీ ప్రభుత్వం దొడ్డిదారిలో వాటిని అమలు చేయడాన్ని నిరసిస్తూ నినాదాలు చేశారు. నల్ల చట్టాల ప్రతులను కలెక్టరేట్ ఎదుట దహనం చేశారు. రైతులపై పెట్టిన కేసులను ఉపసంహరించుకోవాలని, రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని, కౌలు రైతులకు గుర్తింపు కార్డులు, బ్యాంకు రుణాలు అందించాలని నినాదాలు చేశారు. ధర్నా కార్యక్రమంలో నాయకులు నూకల బలరామ్, గుదే దుర్గాప్రసాద్, వెంటపల్లి భీమశంకరం, చింతా రాజారెడ్డి, తాడి శ్రీరామమూర్తి, పాలమూరి శ్రీను, కె.లక్ష్మణ్, నల్లి బుజ్జిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రిలో నిలిచిపోయిన పనులను పూర్తి చేయాలి



అమలాపురం ఏరియా ఆసుపత్రి ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో నిరసన

అమలాపురం టౌన్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రమైన అమలాపురం ఏరియా ఆసుపత్రిలో నిలిచిపోయిన నిర్మాణ పనులను సత్వరం పూర్తిచేసి ప్రజలకు పూర్తి స్థాయి వైద్యాన్ని అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో ఏరియా ఆసుపత్రి ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. నిర్మాణ పనులను మధ్యలో నిలిపివేసిన కనస్ట్రక్షన్ కంపెనీపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సీపీఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కాంట్రాక్టు సంస్థ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని దుయ్యబట్టారు. ఆసుపత్రిలో పూర్తిస్థాయి వైద్య సేవలు అందుబాటులో లేకపోవడంతో పేదలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వంద పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేయాలని మల్టీ స్పెషాలిటీ సదుపాయాలు కల్పించాలని నినాదాలు చేశారు. జిల్లా కమిటీ సభ్యులు నూకల బలరామ్, గుదే దుర్గాప్రసాద్, టి.నాగవరలక్ష్మి, తాడి శ్రీరామమూర్తి, పొలమూరి శ్రీను, లక్ష్మణ్, కె.సత్తిబాబు, తాడి శ్రీరామమూర్తి పాల్గొన్నారు.

క్రిస్మస్ వేడుకలు

అమలాపురం రూరల్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): సాకుర్రు దివ్యతేజ విద్యానికేతన్‌లో సోమవారం ముమ్మిడి ప్రతాప్‌కుమార్ అధ్యక్షతన క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మన్నా జూబ్లీ చర్చి పాస్టర్ రెవ ఎర్నెస్ట్ తాతపూడి ముఖ్య అతిథిగా హాజరై క్రిస్మస్ కేక్‌ను కట్ చేసి అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థులు క్రీస్తు జననంతో పాటు అనేక అంశాలపై రూపొందించిన ప్రదర్శనలు ఆహుతులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. విజేతలకు రెవ.ఎర్నెస్ట్ తాతపూడి బహుమతులు అందజేసి అభినందించారు. స్కూల్ డైరెక్టర్ శారా కమల, ప్రిన్సిపాల్ పి.సూర్యభాస్కరరావు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మోరిపోడులో క్రిస్మస్ వేడుకలు

మలికిపురం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మోరిపోడు రివర్‌సైడ్ స్కూల్‌లో క్రిస్మస్ వేడుకల్లో భాగంగా సోమవారం పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఎల్‌కేజీ, యూకేజీ చదువుతున్న విద్యార్థులు వివిధ పుష్పాల ఆకృతుల్లో ముస్తాబై నాట్యాలతో అలరించారు. అలాగే దేశ నాయకులైనా నెహ్రూ, అంబేడ్కర్, అబ్దుల్‌కలాం, ఇందిరాగాంధీ, సరోజినీనాయుడు, సుభాష్‌చంద్రబోస్, సీతారామరాజు, గాంధీజీ, ఠాగూర్ వంటి వేషధారణలతో విద్యార్థులు నిర్వహించిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

అంతర్వేది దేవస్థానంలో రెవెన్యూ సదస్సు

అంతర్వేది, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): అంతర్వేది దేవస్థానం గ్రామంలో సోమవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. భూ సమస్యలపై స్థానిక రైతులు, గ్రామస్తులకు అవగాహన కల్పించారు. రైతులు రెవెన్యూ అధికారులకు వినతిపత్రాలు అందించారు. డిప్యూటీ తహశీల్దార్ భాస్కర్, సర్వేయర్ భద్రరాజు, వీఆర్వో ప్రసాద్, ఎంపీటీసీ బైరా నాగరాజు, మాజీ ఎంపీటీసీ మందపాటి వెంకటేశ్వర్లు, స్థానికులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

పీవీ నరసింహారావు వర్ధంతి

ముమ్మిడివరం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని పీవీ నరసింహారావు వర్ధంతిని సోమవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ముమ్మిడివరంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించి దేశానికి ఆయన అందించిన సేవలను కొనియాడారు. బడుగు, బలహీనవర్గాల ప్రజలకు అందించిన సేవలు, దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపేందుకు ఆయన ఎన్నో సంస్కరణలు చేపట్టారని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో పెన్మెత్స జగ్గప్పరాజు, పి.ఉదయభాస్కరవర్మ, పాలెపు ధర్మారావు, వడ్డి నాగేశ్వరరావు, డి.వెంకన్నబాబు, ఎం.శివప్రసాద్ పాల్గొన్నారు.

కవిశ్రీ నీలం వర్ధంతి

ముమ్మిడివరం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): భారత రిపబ్లికన్ పార్టీ నాయకుడు కవిశ్రీ నీలం వర్ధంతిని ముమ్మిడివరంలో ఘనంగా నిర్వహించారు. పోలమ్మచెరువుగట్టున జైబుద్ధ పార్కులో కవిశ్రీ నీలం చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. చీకురుమెల్లి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న వక్తలు మాట్లాడుతూ కవిశ్రీ నీలం అంబేడ్కర్ భావజాలాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు తన జీవితాన్ని త్యాగం చేసిన మహోన్నత వ్యక్తి అన్నారు. కార్యక్రమంలో దడాల రామకృష్ణ, ఎం.ఆశీర్వాదం, దాసరి వెంకటరమణ, పంతగడ నరసింహమూర్తి, వడ్డి నాగేశ్వరరావు, దేవరపల్లి ఏడుకొండలు తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

విద్యాభివృద్ధికి దాతలందిస్తున్న సహకారం అభినందనీయం

మామిడికుదురు, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): విద్యాభివృద్ధికి దాతలు అందిస్తున్న సహకారం అభినందనీయమని ఎంఈవో లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. గణిత దినోత్సవం సందర్భంగా మండలంలోని 12పాఠశాలలకు చెందిన విద్యార్థులకు మండల స్థాయిలో వ్యాసరచన, క్విజ్, డిబేట్ తదితర అంశాల్లో పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. ప్రవాసాంధ్రుడు నయినాల శ్రీనివాస్ బహుమతులకు రూ.28వేలు సమకూర్చారు. ఈసందర్భంగా శ్రీనివాస్‌ను ఎంఈవో అభినందించారు. కార్యక్రమంలో విశ్రాంత హెచ్ఎం మైలవరపు రవీంద్రనాథ్, ఎస్ఎంసీ చైర్మన్ వేగి శ్రీనివాసరావు, నయినాల తమ్మారావు, డి.సత్యనారాయణ, మేడిచర్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రజల అభివృద్ధిని కోరుకునేది కూటమి ప్రభుత్వం



అయినవిల్లి, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): ప్రజల అభివృద్ధిని కోరుకునేది కూటమి ప్రభుత్వమని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. సోమవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో మట్టపర్తి నాగవిజయలక్ష్మి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఎమ్మెల్యే గిడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ల నాయకత్వంలో గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు, పెన్షన్ల పెంపు, తాగునీరు తదితర ఎన్నికల హామీలను కూటమి ప్రభుత్వం నెరవేర్చిందన్నారు. గత ప్రభుత్వ కాలంలో ఇళ్ల స్థలాలకు సేకరించిన భూముల్లో రెండు సంవత్సరాల నుంచి పొజిషన్ తీసుకోకుంటే వాటిని రద్దు చేస్తామన్నారు. అర్హులైన వారికి మూడు సెంట్ల ఇళ్ల స్థలం ఇస్తామన్నారు. ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి ప్రజలకు సంక్షేమం, అభివృద్ధి అందించడంలో ముందుండాలన్నారు. మండల పరిషత్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే గిడ్డిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో తహశీల్దార్ సీహెచ్ నాగలక్ష్మమ్మ, ఎంపీడీవో భీమారావు, విస్తరణాధికారి వాణిశ్రీబెహరా, జడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాస్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా గణిత దినోత్సవం

అంబాజీపేట, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): తొండవరం జడ్పీ హైస్కూల్‌లో జాతీయ గణిత దినోత్సవాన్ని హెచ్ఎం కేశవాచార్యుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా రామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ శ్రీనివాసరామానుజన్ గణిత మేధావిగా దేశానికి ఎంతో కీర్తి ప్రతిష్టలు సాధించారన్నారు. జాతీయ గణిత దినోత్సవ ఆవశ్యకతను వివరించారు. గణితంపై క్విజ్ పోటీలు నిర్వహించారు. పాఠశాలలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందించారు. గణిత ఉపాధ్యాయులు గాదె శ్రీనివాసరావు, పాటి వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు మట్టపర్తి రాంబాబు, గంటి శ్రీనివాస్, మానుకొండ చంద్రరావు, పిల్లి త్రిమూర్తులు, పినిపే సత్యనారాయణ, కత్తుల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలి

అంబాజీపేట, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): దాతలు అందిస్తున్న స్టడీ మెటీరియల్‌ను విద్యార్థులు ఉపయోగించుకుని మంచి మార్కులతో నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలని హెచ్ఎం కడలి సాయిరాం అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌కు హైదరాబాద్‌కు చెందిన డీఎస్ సెక్షన్ అన్నపూర్ణ విద్యార్థులకు మోడల్ పేపర్స్ 105 పుస్తకాలను ఉచితంగా అందించారు. వీటిని విద్యార్థులను పూర్తిస్థాయిలో ఉపయోగించుకుని పదో తరగతి పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలన్నారు. అనంతరం దాతలను అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వి.సత్యనారాయణ, బి.వెంకటేశ్వరరావు, శర్మ, రామలింగేశ్వరరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మలికిపురం ఎంపీడీవోకు పదోన్నతి

మలికిపురం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మలికిపురం ఎంపీడీవో నిమ్మగడ్డ బాలాజీకి డీఎల్డీవోగా పదోన్నతి లభించింది. దీంతో కృష్ణా జిల్లాకు బదిలీ అయ్యారు. ఈసందర్భంగా మలికిపురం ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం ఎమ్మెల్యే దేవ వరప్రసాద్, స్థానిక ప్రజాప్రతినిధులు, కార్యాలయ సిబ్బంది ఆమెను ఘనంగా సన్మానించారు.

ఆక్రమణలు తొలగించి ముంపు నుంచి విముక్తి కల్పించండి

కాట్రేనికోన, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): ఆక్రమణల కారణంగా ముంపునీరు బయటకు పోయే మార్గం లేక నానా ఇక్కట్లు పడుతున్నామని కాట్రేనికోన మార్కెట్ ఏరియా ప్రజలు సోమవారం గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. ముంపునీరు దిగే ప్రాంతాన్ని ఒక వీఆర్‌ఏ కబ్జా చేసి పశువుల పాక నిర్మించుకున్నాడని ఆరోపించారు. మురుగు దిగే అవకాశం లేక తామంతా ఇబ్బందులు పడుతున్నామని అన్నారు. ఆక్రమణలు తొలగించి తమకు న్యాయం చెయ్యాలని కోరారు. శీలం రాణి వైశ్రీను, జి.శ్రీసాయిప్రవీణ్, కె.చంద్రరావు, కె.లోవకుమారి తదితరులు ఫిర్యాదు చేసిన వారిలో ఉన్నారు.

ప్రజాసమస్యల పరిష్కార వేదికకు హాజరుకావాలి

అల్లవరం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికకు అధికారులు పూర్తిస్థాయిలో హాజరు కావాలని ఎంపీడీవో బీఎస్ఎస్ కృష్ణమోహన్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పీజీఆర్ఎస్ మండల నోడల్ అధికారి ఎంపీడీవో కృష్ణమోహన్ అధ్యక్షతన మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం జరిగింది. ప్రతి సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక మండల పరిషత్ వద్ద నిర్వహిస్తామన్నారు. అన్నిశాఖల అధికారులు హాజరై అర్జీదారుల సమస్యలు పరిష్కార మార్గాలపై దృష్టి సారించాలన్నారు. జిల్లా కలెక్టర్ ఉత్తర్వుల మేరకు చిన్న సమస్యలు స్థానికంగానే పరిష్కరించుకోవాలని ఆ దిశగా అందరూ బాధ్యతగా పనిచేయాలన్నారు. ఈవోపీఆర్డీ నాగేంద్ర పాల్గొన్నారు.

పంట బోదెలో పడి వ్యక్తి మృతి

మలికిపురం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కేశనపల్లికి చెందిన కొప్పాడి ఏడుకొండలు (46) గూడపల్లి మురుగుకాల్వలో పడి చనిపోయినట్టు తెలిసింది. ఏడుకొండలుకు వివాహం కాగా భార్య చనిపోయింది. పిల్లలు లేకపోవడంతో ప్రస్తుతం తల్లి వద్ద ఉంటూ జీవిస్తున్నాడు. శనివారం మధ్యాహ్న భోజనం చేసి బయటికి వెళ్లి సాయంత్రం వరకు తిరిగి రాలేదు. 22న ఏడుకొండలు కాల్వలో పడి మృతిచెందినట్టు తెలియగా కుటుంబ సభ్యులు మలికిపురం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్టు ఎస్ఐ పి.సురేష్ తెలిపారు.

చీర అంటుకుని మహిళ మృతి

మలికిపురం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): గుబ్బలపాలేనికి చెందిన పెచ్చెట్టి ధనలక్ష్మి(65) ఇంట్లో కట్టెల పొయ్యిపై వేడి నీళ్ల కాచుకుంటుండగా చీర అంటుకుని ఆమె శరీరం కాలింది. వెంటనే ఆమె కుటుంబ సభ్యులు అమలాపురం కిమ్స్ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించారు. చికిత్స పొందుతూ మృతిచెందినట్టు కుమారుడు పెచ్చెట్టి శ్రీనివాసరావు ఫిర్యాదు చేశారని ఎస్ఐ పి.సురేష్ సోమవారం తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

అరుణకుమారికి ప్రథమ స్థానం

మలికిపురం, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయిలో రాజమహేంద్రవరంలో జరిగిన జాతీయ గణిత దినోత్సవ వేడుకలు-2024లో గణిత రంగవల్లికల పోటీల్లో మేడిచర్లపాలెం జిల్లాపరిషత్ హైస్కూల్‌కు చెందిన ఉపాధ్యాయురాలు జి.అరుణకుమారి ప్రథమస్థానంలో నిలిచి బహుమతిని అందుకున్నారు. రంగవల్లికల పోటీల్లో ప్రథమస్థానం, గణిత బోధనోపకరణాల ప్రదర్శనలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచినందుకు తూర్పుగోదావరి జిల్లా డీఈవో అబ్రహం చేతులమీదుగా ఆమె బహుమతిని అందుకున్నారు. అరుణకుమారిని మండల విద్యాశాఖాధికారులు, ప్రధానోపాధ్యాయులు అభినందించారు.

హక్కులపై వినియోగదారులు అవగాహన పెంచుకోవాలి

ఉప్పలగుప్తం, డిసెంబరు23(ఆంధ్రజ్యోతి): ప్రతి వినియోగదారుడు హక్కులపై పూర్తి అవగాహన పెంచుకోవాలని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి ఉదయ్‌భాస్కర్ సూచించారు. జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా సోమవారం గొల్లవిల్లి, భీమనపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలల వద్ద జరిగిన అవగాహనా కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. వినియోగదారుల హక్కులపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. మండల కన్స్యూమర్ ఫోరం కన్వీనర్ అద్దంకి అమరేశ్వరరావు, కన్స్యూమర్ క్లబ్ కన్వీనర్ రత్నకుమారి, ఎంఈవోలు కె.కిరణ్‌బాబు, సత్తి సత్యకృష్ణ, హెచ్ఎంలు లంక రాణి, నూకల సత్యనారాయణ, గొల్లవిల్లి హైస్కూల్ పీఎంసీ చైర్మన్ వాలా సత్యనారాయణ, ఉపాధ్యాయులు అరవ నాయుడు, కామన మధు, పద్మనాభన్ పాల్గొన్నారు.

నేటి నుంచి విద్యుత్ బిల్లుల చెల్లింపునకు స్పెషల్ డ్రైవ్

అమలాపురంటౌన్/ఉప్పలగుప్తం, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఆధ్వర్యంలో ఈనెల24 నుంచి 31 వరకు ఉప్పలగుప్తం సెక్షన్ పరిధిలో విద్యుత్ బిల్లుల చెల్లింపునకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్టు ట్రాన్స్‌కో ఈఈ ఎం.రవికుమార్ తెలిపారు. ఈనెల24న ఎన్.కొత్తపల్లి పంచాయతీ కార్యాలయంవద్ద, 26న వాసాలతిప్ప రామాలయం వద్ద, 27న ఎస్.యానాం పంచాయతీ కార్యాలయం వద్ద, 28న చల్లపల్లి పంచాయతీ కార్యాలయం వద్ద, 29నుంచి 31వరకు ఉప్పలగుప్తం సెక్షన్ కార్యాలయం వద్ద ఉదయం 8గంటల నుంచి విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చన్నారు.

ఆర్టీసీ కార్గోలో పోలీసుల తనిఖీలు

అమలాపురం టౌన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): అమలాపురం ఆర్టీసీ డిపో ప్రాంగణంలో ఉన్న కార్గో సర్వీసు సెంటర్‌ను పట్టణ సీఐ పి.వీరబాబు, ఎస్ఐ కిశోర్‌బాబు ఆధ్వర్యంలో సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేసి పార్శిళ్లను పరిశీలించారు. ఆయన వెంట ఎన్.వరహాలబాబు తదితరులు ఉన్నారు.

మండపేట

కొత్తపేట • మండపేట • రామచంద్రపురం



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి సుభాష్

భీమేశ్వరస్వామి దేవస్థానం క్యాలెండర్ ఆవిష్కరణ

ద్రాక్షారామ, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామ భీమేశ్వరస్వామి దేవస్థానం 2025 క్యాలెండర్‌ను సోమవారం మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆవిష్కరించారు. క్యాలెండర్లను ఆలయ సహాయ కమిషనరు అల్లువెంకట దుర్గాభవాని, సర్పంచ్ కొత్తపల్లి అరుణ, అర్చకులు, కూటమి నాయకులకు అందజేశారు. అంతకు ముందు మంత్రి భీమేశ్వరస్వామి, మాణిక్యాంబ అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు బేడా మండపంలో వేదపండితులు ఆశీర్వచనం అందజేశారు. కూటమి నాయకులు చోడిశెట్టి శివాజీ, నామా వెంకన్నబాబు, ఆళ్ల బుజ్జి, ముప్పనపల్లి గణేష్, నవీన్, అల్లం రామకృష్ణ, అర్చకులు, వేద పండితులు పాల్గొన్నారు.



సాధించిన మెడల్స్‌తో విద్యార్థులు

జాతీయ స్థాయి కరాటే పోటీల్లో 'సిద్ధార్థ' విద్యార్థుల ప్రతిభ

ఆలమూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కాకినాడలోని ద్రోణ బ్యాడ్మింటన్ ఇండోర్ స్టేడియం అధ్వర్యంలో జరిగిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో ఆలమూరు శ్రీసిద్ధార్థ హైస్కూలు విద్యార్థులు ప్రతిభ కనబరిచి పలు విభాగాల్లో బహుమతులు సాధించారు. బాయ్స్ సీనియర్స్-ఎ విభాగంలో గెద్దాడ జాయ్‌కిరణ్, బి-విభాగంలో గుత్తుల షణ్ముఖ్ గోల్డ్ మెడల్స్ సాధించారు. గర్ల్స్ విభాగంలో కట్టా అనుశ్రీ గోల్డ్ మెడల్ సాధించింది. బాయ్స్ జూనియర్స్ ఎ-విభాగంలో బండి దేవిక్‌ఆశీష్ గోల్డ్ మెడల్, సి-విభాగంలో కాండ్రేగుల బాలసుబ్రహ్మణ్యవీరప్రశాంత్ గోల్డ్ మెడల్ సాధించినట్టు కరాటే కోచ్ వెంకటలక్ష్మి తెలిపారు. బహుమతులు సాధించిన విద్యార్థులను స్కూలు డైరెక్టర్ కె.ముల్లారావు, కోచ్ వెంకటలక్ష్మి, ఉపాధ్యాయులు అభినందించారు.



సాధించిన మెడల్స్, సర్టిఫికెట్లతో పవర్ లిఫ్టింగ్ క్రీడాకారులు

పవర్ లిఫ్టింగ్ పోటీల్లో క్రీడాకారుల ప్రతిభ

ద్రాక్షారామ, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): తూర్పు, కోనసీమ జిల్లాల అనుసంధానంగా జరిగిన ఫస్ట్ యునైటెడ్ ఈస్ట్ గోదావరి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో ద్రాక్షారామ ఐ ఫిట్‌నెస్ జిమ్ క్రీడాకారులు కోచ్ పూడి జోసఫ్ జేసుదాను శిక్షణలో ప్రతిభ కనబరిచారు. ఈ నెల 22న బొమ్మూరులో జరిగిన పోటీల్లో 59 కేజీల విభాగంలో ఎ.వధీష్ గోల్డ్ మెడల్, మహిళ విభాగంలో బి.అఖిలదేవి సిల్వర్ మెడల్, 93 కేజీల విభాగంలో ఎస్.కృష్ణవీర్ సిల్వర్ మెడల్, బెంచ్ ప్రెస్‌లో పి.జోసఫ్ బ్రాంజ్ మెడల్ సాధించారు. వారికి రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి, పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ కార్యదర్శి డీవీవీ సత్యనారాయణ మెడల్స్ అందజేశారు.



ముమ్మిడివరప్పాడు రహదారిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సత్యానందరావు

'సంక్రాంతి నాటికి గుంతలులేని రహదారులే లక్ష్యం'

రావులపాలెం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ నాటికి కొత్తపేట నియోజకవర్గంలో రహదారులను సుందరంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. మండలం లోని ముమ్మిడివరప్పాడు రహదారి ఆధునికీకరణ పనులను సోమవారం ఆయన తెలుగు రైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో అడపా సత్యనారాయణ, అడపా పార్థసారధి, అడపా శేషు, అడపా ప్రసాద్, సుబ్బన్న, రామాంజనేయులు, క్రాప నాగరాజు, తొత్తరమూడి శ్రీను, ఆర్‌అండ్‌బీ అధికారులు, కూటమి శ్రేణులు పాల్గొన్నారు.



చింతలూరులో ఆధునిక వేమన శతకం పుస్తకాలను పంపిణీ చేస్తున్న కృష్ణకుమార్

ఆధునిక వేమన శతకం పుస్తకాల పంపిణీ

ఆలమూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ ప్రచురణకర్త తురగా కృష్ణకుమార్ సోమవారం ఆలమూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల, చింతలూరు ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు పలు పుస్తకాలను పంపిణీ చేశారు. తమ సంస్థ ముద్రించిన ఆధు నిక వేమన శతకం, కడిమిళ్ల వరప్రసాద్ రచించిన శిష్య శతకంలను విద్యార్థులకు అందించినట్టు కృష్ణకుమార్ తెలిపారు. నేటి విద్యార్థులు మాతృ భాషకు దూరం అవ్వడం వల్ల నైతిక విలువలతో కూడిన విద్య అందడం గగనమవుతోందన్నారు. కృష్ణకుమార్‌ను ఎంఈవో భమిడిపాటి అప్పాజీ, పలువురు ఉపాధ్యాయులు అభినందించారు.

'తక్షణం విధుల్లోకి తీసుకోవాలి'

ఆలమూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సుదీర్ఘకాలంగా పనిచేయించుకుని విధుల నుంచి అర్ధంతరంగా తొలగించిన తమను తక్షణం విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ హెల్త్ అసిస్టెంట్లు కోరారు. వారికి ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బంది మద్దతు తెలిపారు. సోమవారం పెదపళ్ల, చొప్పెల్ల పీహెచ్‌సీల వద్ద భారీ ర్యాలీలు నిర్వహించారు. అనంతరం పీహెచ్‌సీల్లో వినతిపత్రాలు అందించారు. ఏళ్ల తరబడి పనిచేస్తున్న వారిని తొలగించడం అన్యాయమన్నారు. హెల్త్ అసిస్టెంట్లకు మద్దతుగా వైద్యాధికారులు, సిబ్బంది, ఏఎన్ఎంలు ర్యాలీలో పాల్గొన్నారు.





ఆలమూరులో డీసీ చైర్మన్ గోపాలస్వామిని సత్కరిస్తున్న చొప్పెల్ల బట్టీ యూనియన్ నాయకులు,
రాయవరం మండలం పసలపూడిలో డీసీ చైర్మన్ సత్యనారాయణరెడ్డిని సత్కరిస్తున్న టీడీపీ నాయకులు

డిస్ట్రిబ్యూటరీ కమిటీల చైర్మన్లకు సత్కారం

ఆలమూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆలమూరు వాటర్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన మెర్ల గోపాలస్వామిని చొప్పెల్ల ఇటుక బట్టీ యూనియన్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు తోరాటి రాంబాబు, సంకుమళ్ల ఆదిపట్టాభిరామన్న అధ్వర్యంలో నాయకులు సోమవారం ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆలమూరు మాజీ ఎంపీపీ తోరాటి రాంబాబు, మాజీ వైస్ ఎంపీపీ జాంప్రోలు వెంకట్రావు, నాయకులు తోరాటి సత్తిబాబు, గంధం వెంకన్న, పిల్లా నారాయణమూర్తి, మద్దిరెడ్డి బాల, అబ్బిశెట్టి కృష్ణ, వాసన ప్రసాద్, పల్లా సూరిబాబు, గానుగుల నాగు, ఆకుల రెడ్డి, పోతుల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రాయవరం (ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం వాటర్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్‌గా ఎన్నికైన నల్లమిల్లి సత్యనారాయణరెడ్డిని సోమవారం పసలపూడిలో టీడీపీ నేతలు ఘనంగా సత్కరించారు. మాజీ జడ్పీటీసీ కర్రి వెంకటరెడ్డి (కృష్ణ) మాట్లాడుతూ పార్టీ కోసం అహర్నిశలూ కృషి చేసిన వారికి టీడీపీలో ఎల్లప్పుడూ గుర్తింపు ఉంటుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ గ్రామ శాఖ అధ్యక్షుడు నల్లమిల్లి సూర్రెడ్డి, మాజీ ఎంపీటీసీ నల్లమిల్లి వెంకన్నబాబు, అనుసూరి శ్రీనివాసరావు, నల్లమిల్లి సతీష్‌రెడ్డి, కొవ్వూరి సుధాకరరెడ్డి, మాజీ సర్పంచ్ బి.అప్పలనాయుడు, దొరబాబు, సత్తి సుబ్రహ్మణ్యేశ్వరరెడ్డి, బండారు, గోపీ, కొవ్వూరి బులిరెడ్డి, బుంగ పెద్ద, కమ్యూనిస్టు నాయకుడు కొవ్వూరి సత్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'ప్రైవేటుకు దీటుగా విద్యా బోధన'



విద్యార్థినులతో మాట్లాడుతున్న మంత్రి సుభాష్

రామచంద్రపురం (ద్రాక్షారామ), డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా బోధన ఉండాలని మంత్రి సుభాష్ పేర్కొన్నారు. రామచంద్రపురం పట్టణంలోని చింతపల్లి సూరన్ననగర్ ఇందిరా గాంధీ మున్సిపల్ ఉన్నత పాఠశాలను సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. డొక్కాసీతమ్మ మధ్యాహ్న బడి భోజనాన్ని పరిశీలించి ఆహారం రుచి చూశారు. పాఠశాల ప్రాంగణాన్ని చూశారు. క్రీడలకు ప్రాధాన్యమివ్వాలని, పచ్చదనం, పరిశుభ్రంగా ఉంచాలని ప్రధానోపాధ్యాయునికి సూచించారు. విద్యార్థులను బాధ్యత గల పౌరులుగా తీర్చిదిద్దేందుకు ఉపాధ్యాయులు సమిష్టి కృషి చేయాలని కోరారు. అసంపూర్తిగా ఉన్న భవనాలు నిర్మాణం, వంటషెడ్డు ఆధునికీకరణకు కృషి చేస్తానని చెప్పారు.

పేకేరులో రెవెన్యూ సదస్సు

కె.గంగవరం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పేకేరులో డిప్యూటీ తహసీల్దారు శ్రీరామ్‌ప్రసాద్ ఆధ్వర్యంలో సోమవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రైతులు దరఖాస్తులు అందజేశారు. ఆర్ఐ వెంకట్రావు, వీఆర్వో దూలం నాగేశ్వరరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

కపిలేశ్వరపురం (ఆంధ్రజ్యోతి): స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ సాకా శ్రీనివాస్, తహసీల్దారు పి.చిన్నారావు ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రెవెన్యూ, పంచాయతీ సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఆర్ఐ అర్జమ్మ, గ్రామ కార్యదర్శి కె.శివచక్రవర్తి, వీఆర్వోలు, రెవెన్యూ పంచాయతీ సిబ్బంది, గ్రామ సర్వేయర్లు, గ్రామ పెద్దలు, రైతులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన

రావులపాలెం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): హెచ్ఐవీ, ఎయిడ్స్ పట్ల అవగాహన కలిగి ఉన్ననాడే నిర్మూలన సాధ్యమని ఆర్టీసీ రావులపాలెం డిపో మేనేజరు కేడీఎంఎస్ కుమార్ అన్నారు. కాంప్లెక్స్ వద్ద ఏర్పాటు చేసిన శిబిరాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. అసిస్టెంట్ మేనేజరు అచ్యుతాంబ, ఐసీటీసీ కౌన్సిలర్ ఎం.దుర్గాప్రసాద్, మెడికల్, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సుభాష్

'పీఎం సూర్యఘర్ యోజన'తో స్వయం సమృద్ధి

ద్రాక్షారామ, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకంతో విద్యుత్‌పరంగా వినియోగదారులు స్వయం సమృద్ధి సాధించవచ్చని మంత్రి సుభాష్ పేర్కొన్నారు. సోమవారం ద్రాక్షారామ పంచాయతీ కార్యాలయంలో ఈ పథకంపై ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ కె.రాజుబాబు ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. మంత్రి సుభాష్ మాట్లాడుతూ భవనంపై స్థలం 1 కిలోవాట్‌కు 100 చదరపు అడుగులు, 2 కిలోవాట్‌లకు 200 చదరపు అడుగులు, 3 కిలోవాట్‌లకు 300 చదరపు అడుగులు ఉండాలన్నారు. 1 కిలోవాట్‌కు రూ.30వేలు, 2 కిలోవాట్‌లకు రూ.60 వేలు, మూడు కిలోవాట్‌లకు రూ.78వేలు రాయితీని ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. గృహ వినియోగదారులు తమకు కావలసిన విద్యుత్‌ను తామే ఉత్పత్తి చేసుకోవచ్చని, మిగిలితే సంస్థ కొనుగోలు చేస్తుందని వివరించారు. మంత్రిని ఎస్ఈ సత్కరించారు. సర్పంచ్ కొత్తపల్లి అరుణ, ఈఈ కె.రత్నాలరావు, డీఈఈ కంచుమర్తి మురళీమోహన్, ఏఈ మేడిశెట్టి వెంకటరమణ, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

'ప్రతి రైతు ఫార్మర్ రిజిస్ట్రీ చేయించుకోవాలి'



రైతు సేవా కేంద్రం ఇన్‌చార్జిలకు అవగాహన కల్పిస్తున్న ఏడీ రామారావు

కొత్తపేట, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రైతు సేవా కేంద్రాల్లో ఈ నెల 26 నుంచి జనవరి 14వ తేదీ వరకు ఫార్మర్ రిజిస్ట్రీ తప్పనిసరిగా చేయించుకోవాలని వ్యవసాయశాఖ కొత్తపేట ఏడీ ఎంవీ రామారావు కోరారు. సోమవారం ఆయన రైతు సేవా కేంద్రాల ఇన్‌చార్జిలకు ఫార్మర్ రిజిస్ట్రీపై అవగాహన కల్పించారు. ఫార్మర్ రిజిస్ట్రీ చేయించుకున్న ప్రతి రైతుకు ఒక యూనిట్ ఐడీ క్రియేట్ అవుతుందని, తద్వారా ఆన్‌లైన్‌లో రైతుల వివరాలు వస్తాయన్నారు. ఇందులో రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారికి మాత్రమే పీఎం కిసాన్, రైతు భరోసా పథకాలు వర్తిస్తాయన్నారు. ఆధార్ కార్డు నకలు, పట్టాదారు పాస్ పుస్తకం, 1బి అండగల్ నకళ్లు, మొబైల్ నెంబరుతో రైతు సేవా కేంద్రం ఇన్‌చార్జి ద్వారా నమోదు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏవోలు డి.మీనా, జె.భార్గవమహేష్, సిబ్బంది పాల్గొన్నారు.

'వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేది

కూటమి ప్రభుత్వమే'

కొత్తపేట, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. సోమవారం జాతీయ రైతు దినోత్సవాన్ని పురస్కరించుకుని రైతులందరికీ ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ఆరుగాలం శ్రమిస్తున్న రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. రైతుల కష్టాలు తెలిసిన ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి గత ప్రభుత్వంలో ఉన్న రూ.1,674 కోట్ల బకాయిలను విడుదల చేశారని గుర్తు చేశారు. ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లోనే రైతులకు సొమ్ము చెల్లిస్తున్నామన్నారు. 90 శాతం రాయితీతో డ్రిప్ ఇరిగేషన్ పునరుద్ధరించామన్నారు. 2027 డిసెంబరు నాటికి పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తిచేసేలా ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసిందని చెప్పారు.



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న కాలనీ వాసులు, సీఐటీయూ నేతలు

అమిత్ షా వ్యాఖ్యలకు నిరసన

రాయవరం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేడ్కర్‌పై కేంద్ర హోం మంత్రి అమిత్‌షా వ్యాఖ్యలకు మండలంలోని చెల్లూరులో అంబేడ్కర్ నగర్ కాలనీ వాసులు, సీఐటీయూ నేతలు నిరసన తెలిపారు. అంబేడ్కర్ పట్ల అవమానకరంగా మాట్లాడిన అమిత్ షా వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ మండల కన్వీనర్ డి.ఆదిలక్ష్మి, సీఐటీయూ సభ్యులు సీహెచ్ సత్యవేణి, ఎం.కమల, డి.చంద్రకుమారి పాల్గొన్నారు.



ముమ్మిడివరప్పాడు రహదారి నాడు...నేడు



రహదారికి మోక్షం

రావులపాలెం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఏళ్ల తరబడి ఆధునీకరణకు నోచుకోకపోవడంతో రహదారి ఛిద్రమై గోతులమయంగా మారింది. అటు వాహనచోదకులు, ఇటు గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఈ రహదారికి మోక్షం లభించింది. రావులపాలెం మండలం ముమ్మిడివరప్పాడు ప్రధాన రహదారి గోపాలపురం జాతీయ రహదారి సెంటరు నుంచి ఈతకోట-గంటి రోడ్డు వరకు విస్తరించి ఉంది. ఈ రహదారి మీదుగా కోనసీమ జిల్లా కేంద్రంతో పాటు ఇతర ప్రాంతాలకు నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. అయితే గత వైసీపీ పాలనలో పట్టించుకోకపోవడంతో రహదారి పూర్తిగా ధ్వంసమైంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రహదారుల ప్రత్యేక దృష్టిసారించింది. సోమవారం రహదారి ఆధునికీరణ పనులు చేపట్టారు. రోడ్డు సుందరంగా కనిపిస్తుండటంతో వాహనచోదకులు, గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

26న కె.గంగవరం మండల సమావేశం

కె.గంగవరం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 26న కె.గంగవరం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ పంపన నాగమణిసుబ్బారావు అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీవో ఎన్.శ్రీనివాస్ తెలిపారు. మండల స్థాయి అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికలతో రావాలన్నారు.

మత్స్యావతారంలో వేంకటేశ్వరస్వామి


రాయవరం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాయవరంలోని శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో 44వ దశావతార మహోత్సవాలను పురస్కరించుని సోమవారం వేంకటేశ్వరస్వామి మత్స్యావతారంలో పూజలందుకున్నారు.



ఆలయ అర్చకులు అంగర బాబు, పెద్దింటి కృష్ణమాచార్యులు స్వామివారికి వివిధ రకాల పుష్పాలు, తులసి దళాలతో అర్చన చేశారు. నీరాజన మంత్రపుష్పాలు, మహా నివేదన జరిపారు. రాయవరం, పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

కాలభైరవస్వామి జయంతి

మండపేట, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో కాలభైరవస్వామి జయంత్యుత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి.



ఆలయ అర్చకుడు కాళ్లకూరి రామచంద్రరావు స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఐదు రోజులు ఉత్సవాలు జరుగుతాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ నెల 26న లక్ష బిల్వార్చన, సూర్యనమస్కారాలు, సహస్ర లింగార్చన జరుగుతాయి. 31న భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశామని చెప్పారు.

వాడపల్లి వెంకన్న ఒక్కరోజు ఆదాయం

రూ.3.46 లక్షలు

ఆత్రేయపురం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామిని సోమవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్శించుకున్నారు. వేకువజామునే గోదావరి జలాలను తీర్థపు బిందెతో తీసుకువచ్చి స్నపనమూర్తులకు అభిషేకం చేశారు. అనంతరం తిరుప్పావై వేదపారాయణం నిర్వహించారు. నోము ఆచరించిన భక్తులు అష్టోత్తర పూజలు, నిత్య కల్యాణాలు జరిపించుకున్నారు. వివిధ సేవల ద్వారా ఒక్క రోజు ఆదాయం రూ.3,46,865 లభించినట్టు ఉప కమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.

సుబ్బారావు నేత్ర దానం



ఆత్రేయపురం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పేరవరం గ్రామానికి చెం దిన కొవ్విలి సుబ్బారావు (80) సోమవారం మృతి చెందారు. ఆయనకు భార్య ముగ్గురు కుమారులు, కుమార్తె ఉన్నారు. సుబ్బారావు నేత్రాలను దానం చేయడంతో కుటుంబ సభ్యుల సమాచారం మేరకు రాజమహేంద్రవరం రాధాకృష్ణ ఐ బ్యాంకు వైద్య బృందం వచ్చి కార్నియాలను సేకరించింది.



చెక్కు అందజేస్తున్న మంత్రి సుభాష్

ఆలయ నిర్మాణానికి మంత్రి సుభాష్ ఆర్థిక సాయం

కె.గంగవరం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కూళ్ల ఏటిగట్టుపై ఆంజనేయ స్వామి ఆలయ నిర్మాణానికి కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆర్థిక సాయం చేశారు. రూ.లక్ష చెక్కును ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులకు అందించారు. కమిటీ సభ్యులు కనకాల సుబ్బరాజు, కనకాల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



పలు పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులు

ఇంధన పొదుపు వారోత్సవాలు

రావులపాలెం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రావులపాలెం జడ్పీ బాలుర పాఠశాలలో విద్యుత్ శాఖ ఈఈ ఎం.రవికుమార్ ఆధ్వర్యంలో ఇంధన పొదుపు వారోత్సవాలు నిర్వహించారు. విద్యార్థులకు పలు అంశాల్లో పోటీలు నిర్వహించి ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేశారు. ఏడీఏ చిట్టిరాజు, ఏఈ పి.నరేష్, సిబ్బంది పాల్గొన్నారు.

భీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

ఆత్రేయపురం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కొబ్బరి రైతులు భీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఉద్యానవన శాఖాధికారి జి.కోటేశ్వరరావు పేర్కొన్నారు. కొబ్బరి చెట్టు 4 నుంచి 15 సంవత్సరాలుంటే రూ.900 భీమా కవరేజ్ ఉంటుందని, ఏడాదికి ప్రీమియం రూ.2.25 చెల్లించాలన్నారు. 16 నుంచి 60 సంవత్సరాల వయసు కలిగిన కొబ్బరి చెట్టుకు రూ.1750 వర్తిస్తుందని రైతులు రూ.3.50 కట్టాలన్నారు. మరిన్ని వివరాలకు రైతు సేవా కేంద్రాలు, ఏవో కార్యాలయాల్లో సంప్రదించాలన్నారు.